www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 29 మే 2025
సంపుటి :07 సంచిక : 03 , పేజీలు : 12 వెల:రూ.5/-

## తెలంగాణ హైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్

- సిఫార్సు చేసిన సుప్రీం కొలీజియం



# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బిఆర్ఎస్



*గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని, ఉద్యోగాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండపడ్డారు. తమ ఇంట్లో ఉద్యోగాలు వస్తే చాలనే ధోరణిలో నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారు. మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..*

**హైదరాబాద్,మే28( వెలుతురు):** గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. పీజీలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్-1లో 89శాతం పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయని సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఈ రోజు అంటే బుధవారం తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి అని గుర్తు చేశారు. వారి స్ఫూర్తిని కొనసాగించేం దుకు తెలుగు యూనివర్సిటీకి వారి పేరు పెట్టుకున్నామన్నారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని ఆయన స్పష్టం చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు... మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావాన్ని వీడాలంటూ దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మనూన్యత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు తెచ్చారని గుర్తు చేశారు. కానీ మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? అని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కానీ మేం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అంతేకాదు గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు-.. రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన






# వర్షాకాల ప్రణాళికకు సిద్ధం కావాలి..

- జలమండలి సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం..
- నాణ్యమైన నీటి సరఫరాకు చర్యలు..
- హాట్ స్పాట్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి..
- 300 గజాలకుపైగా ఉన్న నివాసాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి..
- బోర్డు ఆర్థిక పరిస్థితిపై ఆరా అండగా ఉంటామని వెల్లడి..

**హైదరాబాద్ వెలుతురు మే 28:** ముందస్తు వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ చర్యలు తీసుకుంటామని హైదరబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం రోజున ఖైరతాబాద్లోని జలమండలి కార్యాలయంలో వర్షాకాల ప్రణాళిక 90 రోజుల కార్యచరణ, పురోగతిలో ఉన్న పలుప్రాజెక్టు పనులపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఉన్నత అధికారులతో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం

## ఎన్టీఆర్ నుంచి ప్రేరణ పొందా : మోడీ నివాళి

**న్యూఢిల్లీ,మే28( వెలుతురు):** ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించారు. ఆయన తెలుగు సినీ రంగంలో విశిష్ట నటుడు.. దార్శనికత ఉన్న నాయకుడు అని కొనియాడారు.



సినిమాల్లో ఎన్టీఆర్ పోషించిన పాత్రలను ఇప్పటికీ ప్రజలు తలచుకుంటూనే ఉంటున్నారని చెప్పారు. సమాజ సేవ, పేదలు, అణగారిన వర్గాల సాధికారతకు కృషి చేశారన్నారు. ఆయన నుంచి ఎంతో ప్రేరణ పొందినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తోందని వివరించారు.

## వ్యక్తిగత ఎజెండాతో విమర్శలు తగవు

- బిజెపి నేతలకు కిషన్ రెడ్డి క్లాస్



**హైదరాబాద్,మే28( వెలుతురు):** తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ముఖ్యనేతలతో సమావేశమై

## జూన్ 2న రాజీవ్ యువవికాస కార్యక్రమం

- లబ్దిదారులకు మంజూరు లేఖలు అందించాలి
- జాబితా మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటి సిఎం భట్టి ఆదేశం

**హైదరాబాద్,మే 28( వెలుతురు):**



రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

## ముప్పై ఏళ్ల పోరాటానికి దక్కిన గుర్తింపు

- పద్మశ్రీ ఉద్యమకారులకు దక్కిన గౌరవం
- మందకృష్ణ మాదిగా వెల్లడి

**హైదరాబాద్,మే28( వెలుతురు):** వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారు లందరికీ దక్కిన గౌరవం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి



## కెసిఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ

- కాళేశ్వరంపై లోతుగా చర్చించిన నేతలు

**గజ్వేల్,మే28( వెలుతురు):** కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందిన నేపథ్యంలో ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మూడున్నర గంటలగా సమావేశమయ్యారు. ఈ



## మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ నివేదికపై మండిపడ్డ కెటిఆర్

- అది ఎన్‌డిఎ నివేదిక అంటూ విమర్శలు
- కెసిఆర్‌కు పేరు రావడం ఇష్టం లేకే కుట్రలు
- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఆరోపణలు

**హైదరాబాద్,మే28( వెలుతురు):** మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ-) ఇచ్చిన నివేదికను ఎన్డీయే నివేదిక అనడంలో ఎలాంటి తప్పు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. నాణ్యత లేనిది కాళేశ్వరం, మేడిగడ్డలో కాదని.. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న రాజకీయాల్లోనే అని విమర్శించారు. ఎన్ని కుట్రలు సృష్టించినా.. ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుందన్నారు. అశాస్త్రీయ ఆరోపణలను ఎల్ అండ్ టీ ఖండించడం సంతోషమన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అని, కేసీఆర్ దూరదృష్టి గల నాయకుడు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎఎస్ ఇచ్చిన



## బంగాళాఖతంలో బలపడిన అల్పపీడనం



## ఎన్టీఆర్‌ది అజరామర చరిత్ర

- నివాళి అర్పించిన పవన్ కళ్యాణ్



**అమరావతి,మే28( వెలుతురు):** దివంగత స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా

# పార్టీలో నిజమైన కార్యకర్తలే సుప్రీం

- కార్యకర్తలే అధినేతలుగా మహానాడు
- కోవర్టు రాజకీయాలు సహించేది లేదు
- వైఎస్ వివేకా హత్యలో నన్నే మోసం చేయాలని చూశారు
- మహానాడు రెండోరోజు ప్రసంగంలో చంద్రబాబు
- గోదావరి వృధా జలాలు వాడుకుంటే తప్పేంటి
- చివరి రాష్ట్రం కవడంతోనే వాడుకోవాలని నిర్ణయం
- బనకచర్లపై బిఆర్ఎస్ అనవసర రాద్దాంతం
- నదుల అనుసంధానంతో తెలంగాణకు కూడా మేలు
- కడప మహానాడు వేదికపై చంద్రబాబు వ్యాఖ్యలు

**కడప,మే28( వెలుతురు):** కార్యకర్తలే నా హై కమాండ్.. వారే సుప్రీం అని టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీలో వారికే పెద్దపీట అన్నారు. టీడీపీ మహానాడులో రెండో రోజు ఆయన మాట్లాడుతూ.. మళ్లీ జన్మ ఉంటే తెలుగు గడ్డపై పుడతా అన్నారు.. కార్యకర్త నా హై కామాండ్.. కార్యకర్తే నా సుప్రీం అని స్పష్టం చేశారు.. తొలిసారిగా 65 మంది యువతకు సీట్లు ఇచ్చాం... ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచారని గుర్తుచేశారు.. లోకేష్ 6 శాసనాలు ప్రవేశ పెట్టారు.. ఆయనకు ఉన్న నాలెడ్జితో మంచి ఆలోచనలు చేస్తున్నారు.. టీడీపీ కొత్తతరహా



## సత్తా అంటే జగన్‌ను తిట్టడం కాదు

- సత్తా అంటే కడపలో మహానాడు పెట్టడం కాదు
- సత్తా అంటే సూపర్ సిక్స్ హామీల అమలు
- ఎవరి ఇంటికైనా వెళ్లి హామీల గురించి అడగ గలరా
- మహానాడుపై జగన్ సూటి ప్రశ్న

**అమరావతి,మే28( వెలుతురు):** కడప వేదికగా టీడీపీ మహానాడు జరుగుతోన్న వేళ.. ఆ పసుపు పండుగపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. మహానాడు పెద్ద డ్రామాగా అభివర్ణించిన



(మొదటి పేజీ తరువాయి..)

## తెలంగాణ హైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్

హైదరాబాద్,మే28( వెలుతురు):
తెలంగాణహైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) పేరును కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఇక ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ సింగ్ 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తరవాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి పొందారు.

## వ్యక్తిగత ఎజెండాతో విమర్శలు తగవు

నేతలకు క్లాస్ ఇచ్చారు. కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలో పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు- ప్రెస్ మీట్లు- పెట్టి వ్యక్తిగత దూషనలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ కార్యాలయాన్ని వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటే ఊరుకునేది లేదని నేతలకు గట్టిగా చెప్పారు. పార్టీ ఆఫీసులో పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని సూచించారు. ఇక మీదట ప్రెస్ మీట్లు- పెట్టాలంటే అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇది తనతో పాటు- అందరికీ వర్తిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ నేతలు హుందాగా ప్రవర్తించాలని సూచించారు. బీజేపీ అంటే బాధ్యతగల పార్టీ అని సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన పార్టీ అని కీలక వ్యాఖ్యాలు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ ఆఫీస్‌ను ఆశ్రయిస్తున్నారని.. అలాంటి వారికి న్యాయం చేసేలా నేతలు పోరాటం చేయాలని సూచించారు. అలా కాకుండా, ఇష్టం వచ్చినట్లు- ప్రెస్‌మీట్‌లు పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతే చర్యలు తప్పవని స్ట్రాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు.

## బంగాళాఖతంలో బలపడిన అల్పపీడనం

విశాఖపట్నం, మే28( వెలుతురు):
బంగాళాఖా తంలో అల్పపీడనం బలపడిందని వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలో పూర్తిగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడింది. ఇది ఉత్తర దిశగా కదులుతూ రాబోయే 24 గంటల్లో వాయుగుండంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో ఉత్తర కోస్తాలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ఈ నెల 26న మహబూబ్‌నగర్‌లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఇవి ఆదిలాబాద్ వరకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## ఎన్టీఆర్‌ది అజరామర చరిత్ర

జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్టీఆర్ చరిత్ర అజరామరం అని అన్నారు. త్రికరణ శుద్ధితో చేసే ఏ కార్యమైనా సత్ఫలాన్ని ఇస్తుందని తాను విశ్వసిస్తానని.. అటువంటి త్రికరణ శుద్ధితో కార్యాచరణ చేసిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని అన్నారు. మనసు, మాట, కర్మ మూడు అంశాలు సమన్వయం చేసుకొంటూ పని చేయడం ఆయనలో తాను గమనించానని, అందుకే వేషం వేసినా, రాజకీయం ఆచరించినా, ప్రజాసేవ చేసినా ఎన్టీఆర్ సత్ఫలితాలను సాధించారని కొనియాడారు. నటుడిగా, రాజకీయ నేతగా, పరిపాలనాదక్షునిగా.. చరిత్ర పుటలు నుంచి చెరిపివేయలేని చరిత్ర ఆయనదని.. ఈరోజు ఆ మహామనిషి, కళా ఋషి జయంతి సందర్భంగా ఆయనకు పుష్పాంజలి అర్పిస్తున్నానని పవన్ కల్యాణ్ అన్నారు.

## జూన్ 2న రాజీవ్ యువవికాస కార్యక్రమం

బుధవారం భట్టి విక్రమార్క, రాష్ట్ర బి.సి.సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువతకు 6 వేల 250 కోట్లతో స్వయం ఉపాధి కల్పించ నున్నారని భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతి యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం తొడ్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దశల వారిగా జరిగే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు- రాష్ట్ర జి.డి.పి. లో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలపై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్సీ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బీసీ సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## ముప్పై ఏళ్ల పోరాటానికి దక్కిన గుర్తింపు

దక్కిన అభినందనలు అని తెలిపారు. 1994లో ఉద్యమం మొదలైందని, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటమన్నారు. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం సాధ్యమయిందన్నారు. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా మందకృష్ణ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి దక్కిన అభినందనలు. వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికి దక్కిన గౌరవం. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం సాధ్యమయింది. 1994లో ఉద్యమం మొదలైంది, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటం. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఉద్యమ లక్ష్యం నెరవేరింది, కేంద్రం గుర్తింపు కూడా ఇచ్చింది. పద్మశ్రీ అవార్డును గౌరవంగానే కాదు బాధ్యతగా ఫీల్ అవుతున్నాం. ఇంకా పరిష్కారం కాని సమస్యల కోసం భవిష్యత్ ప్రయాణం ఉంటు-ంది. చట్టసభల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఉన్నాయి. రాజకీయాల్లోకి వచ్చినా కండువా మారదు. రాజకీయ చైతన్యం కోసం కూడా సిద్ధం అవుతాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే మాదిగలకు అన్యాయం జరిగింది. ఏపీలో చంద్రబాబు నాయుడు మాదిగలకు ప్రాతినిధ్యం పెంచారు' అని మందకృష్ణ మాదిగ అన్నారు.

## కెసిఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ

సమావేశంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న కమిషన్ ఇచ్చిన నివేదిక, అందించిన నోటీసులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 5న కమిషన్ ముందు విచారణకు హాజరు కానున్నట్లు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న కేసీఆర్, ముందు జాగ్రత్తగా కమిషన్ వద్ద ఉత్పన్నమయ్యే ప్రశ్నలు, వాటికి ఇవ్వాల్సిన సమాధానాలపై హరీష్‌రావుతో సమాలోచనలు జరిపినట్లు- సమాచారం. విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న అంశాలు, ఎక్కడా లోపాలు జరిగాయన్న విషయాలపై పూర్తిగా ఆరా తీసినట్లు-, ఇది కాకుండా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏం సూచించింది? బ్యారేజీ కుంగడపై సాంకేతిక కారణాలు ఏమిటన్న దానిపై పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కమిషన్ ఎదుట హాజరైన కొంతమంది రిటైర్డ్ ఇంజనీర్లతో కేసీఆర్ ఫోన్ ద్వారా మాట్లాడినట్లు-, కమిషన్ అడిగిన ప్రశ్నలు ఏమిటి? ఇంజనీర్లు ఇచ్చిన సమాధానాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై కూడా ఆయన చర్చించినట్లు సమాచారం. మొత్తంగా సమాధానాలు సిద్ధం చేసుకుని కమిషన్ ముందుకు హాజరయ్యేలా కెసిఆర్ సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బిఆర్ఎస్

ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందని పేర్కొన్నారు.వాళ్లింట్లో ఎన్నికల్లో ఓడిపోతే ఆరు నెలలు తిరగకుండానే ఇంకో ఉద్యోగం ఇచ్చుకున్నారని బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. కానీ మీకుమాత్రం ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అలాంటి వారు మీకు ఎదురైతే ప్రశ్నించండంటూ యువతకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే మీరు మీ జీవితంలో రాణిస్తారన్నారు. తప్పుదారి పడితే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దంటూ విద్యార్థులకు హితవు పలికారు. కష్టపడండి.. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో రాణించి తల్లిదండ్రులకే కాదు.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని గుర్తు చేశారు. అలాగే అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామని వివరించారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదు.. చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మీరు రాణించాలని మనస్ఫూర్తిగా తాను కోరుకుంటు-న్నానని తెలిపారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు.చాలా మంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు.. చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది. యంగ్ ఇండియా నా బ్రాండ్.. నా బ్రాండ్ అంబాసిడర్లు మీరే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను సిఎ ఆసక్తిగా తిలకించారు.

## వర్షాకాల ప్రణాళికకు సిద్ధం కావాలి..

ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డైరెక్టర్లు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తాగునీటి సరఫరా మరియు మురుగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. అలాగే సీవరేజ్ రహదారులపై సీవరేజ్ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలాగా చూసుకోవాలని సూచించారు. ఇప్పటికే జలమండలి, జీహెచ్ఎంసీ 146 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించిందని, వాటిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. జలమండలి అధికారులు, సిబ్బంది 90 రోజుల కార్యాచరణ విజయవంతం చేసి, సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులను 30 శాతం తగ్గించడంపై ఎండీతో సహా అందరినీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ 90 రోజుల ప్రణాళికలో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వేసవిలో 40 వేల వినియోగదారులు అధికంగా ట్యాంకర్లు బుక్ చేసినట్టు తెలిపారు. ఆ ప్రాంతంలో సర్వే చేస్తే వారి ప్రాంగణంలో ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఇంకుడు గుంటలు ఉంటే భూగర్భ జలాలు పెరిగి ఈ దుస్థితి రాకపోయేదని అన్నారు. 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీచేసి చేసినట్టు మంత్రి తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలోని 300 గజాల పైన ఉన్న ప్రతీ ప్రాంగణంలో ఇంకుడు గుంతలు నిర్మించడానికి ప్రతిఒక్కరూ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దానిపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. జలమండలి ఆర్థిక పరిస్థితిపై ఆరాతీసిన మంత్రి రెవెన్యూ పెంచుకోవడానికి, నీటి వృధాను అరికట్టడానికి, లీకేజీలను అరికట్టడానికి, ప్రజలలో నీటి వృధా తగ్గించేలా అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అక్రమ నల్లా కనెక్షన్లపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన, వివిధ శాఖలనుంచి జలమండలికి రావాల్సిన బకాయిలపై ముఖ్యమంత్రితో మాట్లాడుతామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రభుత్వం బోర్డు తన కాళ్లమీద తాను నిలబడేలాగా అన్నీ రకాలుగా చేయుతనిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం అందించే స్కీమ్లను వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని.. దానికనుగుణంగా తాగునీరు, మురుగునీటి శుద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి అన్నారు. అందులో భాగంగా 7వేల కోట్లతో గోదావరి ఫేస్ 2,3 ప్రాజెక్టును పనులను చేపట్టిందని, మురుగునీటి శుద్ధికై 39 ఎస్టీపీలను నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రానున్న 30 ఏళ్ల వరకు నీటి అవసరాలకు భరోసా ఉంటుందని వివరించారు. ప్రజలకు నీటి సరఫరా, మురుగునీటి సమస్యలపై జలమండలి కస్టమర్కేర్ 155313 కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అంతకు ముందు జలమండలి ఎండీ అశోక్రెడ్డి, జలమండలిలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు.. పనితీరు, హైదరాబాద్ నగరానికి సరఫరా చేస్తున్న వివిధ ప్రాజెక్టులు, ఎస్టీపీలు, రెవెన్యూ ఆదాయ వ్యయాలతోపాటు భవిష్యత్తు ప్రణాళికను ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే 90 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గౌవరనీయులైన శ్రీ. రేవంత్ రెడ్డి గారు 2024 అక్టోబర్ 2న (గాంధీ జయంతి) ప్రారంభించామని, నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న మురుగునీటి సమస్యలతో పాటు రోజూవారీగా వచ్చే ఫిర్యాదులను సైతం తగ్గించడం, భూగర్భ జలాల పెరుగుదలకు ఇంకుడు గుంతలు నిర్మించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. ఒక్క రూపాయి అదనంగా ఖర్చు పెట్టకుండా, ఉన్న వనరులనే ఉపయోగించుకుంటూ చేస్తున్న ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడానికి బోర్డు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తోందని చెప్పారు. జీఐఎస్ ఆధారిత మొబైల్ యాప్తో పాటు ప్రత్యేకడాష్బోర్డ్ ఏర్పాటు చేసి ప్రధాన కార్యలయం నుంచే ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 3600కిలో మీటర్ల మురుగునీటి పైపులైన్, 3 లక్షల మ్యాన్ హోళ్లలో వ్యర్థాల తొలగించి శుభ్రపర్చడమేలక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. అయితే ఇప్పటివరకు 24650ప్రాంతాల్లో మొత్తం 3,261.84కి.మీ మురుగునీటి పైపులైన్లు, 2.54 లక్షల మ్యాన్హోళ్లలో డీ-సిల్టింగ్ చేసినట్టు వివరించారు. దీనివల్ల నగరంలో 30 శాతం సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులు తగ్గినట్టు ఈ సందర్భంగా ఎండీ వివరించారు. అలాగే ఈ 90 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ఇంకుడు గుంతలను సైతం నిర్మించాలని జలమండలి సంకల్పించిందని అన్నారు. ఎండిపోయిన 58 బోర్వెల్ల చుట్టు 41 ఇంకుడు గుంతలను జలమండలి నిర్మించింది. వీటిని బోర్డు నిధులతో నిర్మించారని చెప్పారు. ఇవే కాకుండా.. 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ప్రాంగణం కలిగి ఇంకుడు గుంతలు లేని వినియోగదారులు వాటిని నిర్మించుకునేలా లక్ష్యం పెట్టుకున్నామని అన్నారు. అలాగే ఇంకుడు గుంతలు లేని వినియోగదారులకు.. వాటిని నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నట్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు కావాల్సిన సహాయ సహకారాలను ఎన్జీవోలు ఇస్తున్నట్లు అన్నారు. జలమండలి ఇచ్చిన ప్రోత్సాహం, చేసిన మార్గదర్శకత్వంలో.. ఇప్పటిదాకా 102 మంది వినియోగదారులు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకున్నట్లు వివరించారు. ఇవేకాకుండా వేసవి కార్యచరణ, వర్షాకాల కార్యచరణ ప్రణాళిక, కొత్త ప్రాజెక్టులు, పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ప్రాజెక్టులపై జలమండలి ఎండీ మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్రెడ్డి, కోర్సిటీ సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, ట్రాన్స్మిషన్ అధికారులు పాల్గొన్నారు.

## మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ నివేదికపై మండిపడ్డ కెటిఆర్

నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ- సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయింది. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ- పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు- లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీ-వల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టు-కుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం. కేసీఆర్‌కు పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్-బీజేపీ.. ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ- అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితో పాటు- కాంగ్రెస్-బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం' అని ఎక్స్‌లో కేటీఆర్ రాసుకొచ్చారు.

## సత్తా అంటే జగన్‌ను తిట్టడం కాదు

ఆయన.. దమ్మంటే కడపలో మహానాడు పెట్టడంకాదు...రాష్ట్రంలో ఏ ఇంటికైనా వెళ్లి తాము ఈ పనిచేశామని టీడీపీ వాళ్లు ధైర్యంగా చెప్పుకోగలరా..అని ప్రశ్నించారు. టీడీపీ వాళ్లు ఇచ్చిన మేనిఫెస్టోలు, బాండ్లు, కరపత్రాలు ఇప్పటికీ ప్రతి ఇంట్లో ఉన్నాయి.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు ఏమయ్యాయని ప్రజలు నిలదీస్తారని పేర్కొన్నారు. చంద్రబాబు మహానాడులో ఫోజులు ఇస్తున్నాడు.. టీడీపీ తెలుగు డ్రామా పార్టీ అంటూ కొత్త నిర్వచనం చెప్పారు.. సత్తా అంటే కడపలో మహానాడు పెట్టడం కాదు.. ఇచ్చిన హామీలు నెరవేర్చడం నిజమైన సత్తా అవుతుంది.. కడపలో మహానాడు పెట్టి.. జగన్‌ను తిట్టడం సత్తా ఎలా అవుతుందని నిలదీశారు. రాష్ట్రం ఎలాంటి పరిస్థితుల్లో ఉందో అందరూ చూస్తున్నారు.. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలి. చంద్రబాబు రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు జగన్.. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్ని-కై-న ప్రజాప్రతినిధులను ప్రలోభ పెట్టి, బెదిరించి, భయపెట్టి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు.. చంద్రబాబుది దౌర్భాగ్యపు పాలని అని విమర్శించారు.. కోవిడ్ లాంటి మహమ్మారి వచ్చి ఆదాయాలు తగ్గి, ఖర్చులు పెరిగి, తీవ్ర సంక్షోభం ఉన్నా.. ఏరోజు కూడా వాటిని సాకులుగా చూపించలేదు.. ప్రజలకు చేయాల్సిన మేలు చేయకుండా పక్కనపెట్టలేదు.. ఎన్ని సమస్యలున్నా ప్రజలకు సంతోషంగా మేలు చేశాం.. ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతి హామీని కూడా నెరవేర్చాం.. సీఎం కార్యాలయం నుంచి ప్రతి కార్యాలయంలోనూ కూడా మేనిఫెస్టో పెట్టాం.. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ దాన్ని అమలు చేసేట్టు-గా చేశాం.. 99శాతం హామీలను అమలు చేశాం.. అంత గొప్పగా ప్రజలకు మేలు చేశాం.. అందుకనే అప్పటి స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేశామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## పార్టీలో నిజమైన కార్యకర్తలే సుప్రీం

పరిపాలనకు శ్రీకారం చుట్టింది.. ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయం తీసుకుంటున్నాం అన్నారు.. కార్యకర్తలే అధినేతలుగా మహానాడు నిర్వహిస్తున్నాం.. కొన్ని నియోజకవర్గాల్లో ఓడినా మెజార్టీ వచ్చిందని వెల్లడించారు.. ఇక, గుండె పోటుతో వివేకానంద రెడ్డి మృతి చెందారు... ఆ నాడు నేనుకూడా నమ్మాను.. గొడ్డలితో నరకడం వల్ల మెదడు కూడా బయటకు వచ్చినా దాచారు అంటూ వైఎస్ వివేకా హత్య కేసుపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఆ రోజు సాయంత్రానికి అనేక మలుపులు తిప్పింది ఎవరో మీకు తెలుసు... మరుసటి రోజు నారాసుర రక్త చరిత్ర అని రాశారని ఫైర్ అయ్యారు. వివేకా హత్య కేసు విషయంలో నాలాంటి నాయకుణ్నే మోసం చేయగలిగారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని ప్రచారం చేశారు.. అందరిలా నేనూ నమ్మాను. సాయంత్రానికి గొడ్డలిపోటు- విషయం బయటకి వచ్చింది. నాపై నెపం వేసేందుకు దుష్ప్రచారాలు చేశారని చంద్రబాబు మండిపడ్డారు.అయితే, మన దగ్గర ఉండే కొందరు కోవర్టు రాజకీయాలు చేస్తున్నారు.. తప్పులు చేసే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. నేరస్తులు ఖబడ్దార్.. నా వద్ద మీ ఆగడాలు సాగవు.. కోవర్టులతో రాజకీయాలు చేస్తే ఉరుకోను అని వార్నింగ్ ఇచ్చారు.. కోవర్టుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు సీఎం చంద్రబాబు.. పార్టీలోకి వలస పక్షులు వస్తాయ్.. పోతాయ్.. నిజమైన కార్యకర్త శాశ్వతంగా ఉంటాడని తెదేపా చంద్రబాబు అన్నారు. నేరస్థులు చేసే కనికట్టు- మాయపై అందరూ అప్రమత్తంగా ఉండాలి. కోవర్టులను పార్టీలోకి పంపాలనుకుంటే మీ ఆటలు సాగవు. సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై దుష్ప్రచారాలు చేస్తే సహించం. ఆడబిడ్డలపై అసభ్యంగా ప్రవర్తించే వారికి అదే చివరి రోజు అవుతుందని చంద్రబాబు అన్నారు. వృధాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను వాడుకుంటే వచ్చే నష్టమేంటని సిఎం చంద్రబాబు అన్నారు. వృధా జలాలను వినియోగంలోకి తేవాలన్న లక్ష్యం మేరకు బనకచర్ల ప్రతిపాదనలు చేశామని, అయితే దీనిపై బిఆర్ఎస్ పార్టీ రాద్ధాంతం చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా మరోసారి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహానాడులో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తామన్నారు. శాంతిభద్రతలను ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. తప్పు చేసినవారి పట్ల చండశాసనుడిలా ఉంటానని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని ఫైర్ అయ్యారు. రాయలసీమను ఎడారి కానివ్వమని, రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. అలాగే, 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు తెలిపారు.బనకచర్ల వరకు నీరు తేవాలన్నదే తమ లక్ష్యమన్నారు. నదుల అనుసంధానం పూర్తి చేస్తామని, నదీ జలాల వినియోగంలో ఏపీ చివరి రాష్ట్రమని, నదుల అనుసంధానంతో తెలంగాణకూ లాభమేనని చంద్రబాబు వివరించారు. ఈ అంశంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదని, సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే తప్పేంటని చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు వంటివి అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంతవరకు శక్తిమేర పార్టీని సమర్థంగా నడిపానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నా బలం, బలగం.. టీ-డీపీ నాయకులు, కార్యకర్తలేనని పేర్కొన్నారు. ఇంతవరకు జరిగిన అన్ని మహానాడుల కంటే కడప మహానాడు ప్రత్యేకమన్నారు. తెలుగుజాతి ఉన్నంతవరకు టీడీపీ ఉంటుందని, రానున్న 40 ఏళ్లకు ప్రణాళికలు రూపొందించుకున్నామని స్పష్టం చేశారు. ఫ్యాక్షనిజం, నక్సలిజాన్ని తుదముట్టించిన పార్టీ టీడీపీ అన్నారు. గత ఐదేళ్లు ఏపీలో శాంతిభద్రతలు లేవని, వైసీపీ హయాంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయిని హత్య చేసి ఆ నింద మనపై మోపాలని చూశారని అయితే తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదన్నారు. తప్పు చేసిన వారిని ఎట్టిపరిస్థితిలోనూ వదిలిపెట్టేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

# బీసీలకు నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలి.

- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 28:** కులగణన చేసి బీసీలు 56 శాతం ఉన్నారని తేల్చిన కాంగ్రెస్ పార్టీ అదే రీతిలో బీసీల జనాభా దామాషా ప్రకారం ఇంకా నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినీ డిమాండ్ చేశారు.కులగణన చేసినం అని సంకలు గుద్దుకోవడం కాదు కాంగ్రెస్ పార్టీ తేల్చిన లెక్కల ప్రకారం,మీ పార్టీకి చిత్త శుద్ధి ఉంటే బీసీల పై ప్రేమ ఉంటే మిగిలిన అరే మంత్రి పదవుల్లో బీసీలకు నాలుగు మంత్రి పదవులు కేటాయించాలి. ఒకవేళ అలా కాదని ఒకే కులానికి ఇచ్చుకుంటాం అంటే మాత్రం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

# తమిళంలో నుంచే కన్నడ పుట్టింది

- **కమలహాసన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కన్నడిగులు**
- **కమల్‌కు కన్నడ చరిత్ర తెలియదంటూ సిఎం సిద్ధరామయ్య విసుర్లు**



**బెంగళూరు,మే 28( వెలుతురు):**

తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తాను నటించిన థగ్‌లైఫ్ సినిమా ఆడియో విడుదల సందర్భంగా చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నా జీవితం, నా కుటుంబం తమిళ భాష' అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై కన్నడిగులు మండిపడు తున్నారు. తాజాగా ఈ వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. ఈ మేరకు నటుడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదని పేర్కొన్నారు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియవంటూ ఎద్దేవా చేశారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు. 'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా. మీ భాష (కన్న) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే తమిళం నుంచి కన్నడ పుట్టిందన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. బెంగళూరులో థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను కొందరు ఆందోళనకారులు చించివేశారు. 'కర్ణాటకలో మీకు వ్యాపారం కావాలి.. కానీ కన్నడ భాషను అవమానిస్తారా?' అని ధ్వజమెత్తారు.


# మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ

- **దండుగులను అరెస్ట్ చేసిన పోలీసులు**




**హైదరాబాద్,మే 28( వెలుతురు):**

మేడ్చల్ జిల్లాలోని షాపూర్‌నగర్‌లో మావోయిస్టు పేరుతో బెదిరింపు లేఖ కలకలం సృష్టించింది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుడి కుటుంబాన్ని లేఖలో లక్ష్యంగా చేసుకున్నారు. రూ.50 లక్షలు ఇవ్వకపోతే కూన రవీందర్‌గౌడ్ కుమారుడు కూన రాఘవేందర్ గౌడ్‌ను చంపుతామని అందులో పేర్కొన్నారు. రెండు ఇళ్లను బాంబులతో పేల్చేస్తామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి ముందు వస్తువులు ధ్వంసం చేసి అక్కడ లేఖను ఉంచారు. ఈ క్రమంలో జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టుల లేఖ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21న మావోయిస్టుల పేరుతో నిందితులు లేఖ రాశారు. వారిని కూన రాఘవేందర్‌గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు, అతడి స్నేహితుడిగా గుర్తించారు. నిందితుల వద్ద నాటుబాంబులు, 3 సెల్‌ఫోన్లు, 2 బెదిరింపు లేఖలను స్వాధీనం చేసుకున్నారు. నాటుబాంబులను వారు విజయనగరంలో కొనుగోలు చేసినట్లు తెలిసింది. కారుపై ఎరుపు రంగు టవల్‌లో లేఖ పెట్టి వెళ్లిపోయారు. ఘటన ఈ నెల 21న జరిగినట్లు- రాఘవేందర్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో ఓ వ్యక్తి మాస్క్ ధరించి వచ్చినట్లు- గుర్తించారు. తాజాగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.



నాగోల్‌లోని పీబీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన అడ్వకేట్ శ్రీనివాసుల గణేష్ భరద్వాజ్ వివాహానికి బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, బీజేవైఎం నాయకులు సాయి నిఖిల్ చారి, రమేష్ ముదిరాజ్, ఐలయ్య యాదవ్ తదితరులు హాజరయ్యారు.

**నాగోల్ వెలుతురు మే 28:**

# జూన్ 8 వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ..



- **చేప ప్రసాదం పంపిణీ కోసం ఫిషరీస్ డిపార్ట్మెంట్ నుండి 1.5 లక్షల చేపల ఏర్పాటు**
- **చేప ప్రసాదం కోసం వచ్చే భక్తులకు గత సంవత్సరం కంటే అదనంగా మరిన్ని ఏర్పాట్లు చేయాలి**
- **నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలి , అగ్నిమాపక బృందాలు అప్రమత్తంగా ఉండాలి**
- **పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి జీహెచ్ఎంసీ, విద్యుత్ తదితర డిపార్ట్మెంట్లు సమన్వయం చేసుకొని పని చేయాలి**
- **చేప ప్రసాదం పంపిణీ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ వెలుతురు మే 28:**

జూన్ 8 వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో చేయాల్సిన ఏర్పాట్ల పై సచివాలయంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్ వివిధ విభాగాల అధికారులు సమీక్షా సమావేశం లో పాల్గొన్నారు. హైదరాబాద్ లో 185 సంవత్సరాలుగా ఉబ్బస వ్యాధిగ్రస్తులకు బత్తిని సోదరులు పంపిణీ చేస్తున్న చేప ప్రసాదం పై ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. లక్షలాది మంది పాల్గొనే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో పోలీసులు పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకోవాలని లా అండ్ ఆర్డర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీస్ అధికారులకు సూచించారు. ఈసంవత్సరం చేప ప్రసాదం పంపిణీ కోసం 1.5 లక్షల చేప పిల్లలను ఏర్పాటు చేసినట్లు ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు తెలిపారు. చేప పిల్లల ఖర్చును నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ భరించాలని సూచించారు. వచ్చే భక్తులకు క్యూ లైన్ లో ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ,మహిళలకు వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ పాస్ లు లిమిట్ గా పెట్టడం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని సూచించారు. చేప ప్రసాదం కోసం బయట రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండడంతో వారికి సరిపడ తాగునీటి సౌకర్యాలు , టాయిలెట్స్ ఏర్పాటు , స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే బోజన సౌకర్యాలకు ఇబ్బందులు లేకుండా వారికి జీహెచ్ఎంసీ నుండి సహకారం అందించాలని పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ చుట్టూ పది పార్కింగ్ ప్రదేశాలు ఏరోటి చేసినట్టు వెల్లడించారు. వాహనాలు మొరాయించినప్పుడు వాటిని తీసుకెళ్లడానికి క్రేన్ వాహనాలు సిద్ధం చేసుకోవాలని సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఉండేలా చూడాలని,మొబైల్ టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు.గార్బేజ్ తరలింపునకు వాహనాలు సిద్ధం చేయాలని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ లు ఫిష్ పర్యవేక్షణ చేస్తారని , ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పర్యవేక్షణ ఉంటుందని అధికారులు మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లారు. దూద్ బౌలి, నాంపల్లి లో కరెంట్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి రావడం కోసం ఆర్టీసీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ ,చర్లపల్లి నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. చేప ప్రసాదం పంపిణీ జరిగే ప్రదేశాల్లో వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ,నాలుగు హెల్త్ క్యాంపులు ,నాలుగు అంబులెన్స్ లు ఏర్పాటు చేస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. చేప ప్రసాదం వేసే వాలంటీర్లకు సీపీఆర్ శిక్షణ ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. చేప ప్రసాదం కోసం టోకెన్ లకు అదనపు కౌంటర్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఐ అండ్ పీఆర్ ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇవ్వడం చేప ప్రసాదం కోసం వచ్చే సౌకర్యాలు తదితర వాటిపై చూసుకోవాలని తెలిపారు. లయన్స్ క్లబ్ , ఎన్ సీ సీ నుండి వాలంటీర్ లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అన్ని డిపార్ట్మెంట్ లను కోఆర్డినేట్ చేసుకోవడానికి 20 ప్రాంతాల్లో ఒక ఆర్డీవో,ఒక అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సమీక్షా సమావేశంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,అడిషనల్ సిపి విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, రెవెన్యూ ,హెల్త్,ఫైర్, వాటర్ వర్క్, ఆర్ అండ్ బి , బత్తిని కుటుంబ సభ్యులు బత్తిని అమరనాథ్ గౌడ్ , గౌరీ శంకర్ ,చంద్రశేఖర్ ,శివ శంకర్ , సంతోష్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లలో పిల్లలతో వెట్టి

- **శానిటేషన్ సిబ్బందిని తొలగింపు**
- **కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కవిత మండిపాటు**



**హైదరాబాద్,మే28( వెలుతురు):**


కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో సంక్షేమం కొరవడిందని, పిల్లలే టాయ్‌లెట్‌ఉ శుభ్రం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఉన్న పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ . 40,000 కేటాయిస్తే నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారని కవిత గుర్తు చేశారు. వీరు టాయిలెట్లు-, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెల నుండి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించినందున పిల్లలే టాయిలెట్లు-, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్‌గా చేసుకోవాలని చెప్పారని కవిత పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలోని వాచ్‌మెన్ వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటివరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా పిల్లలు కమిటీ-గా ఏర్పడి క్వాలిటీ- చెక్ చేసుకునేవారు. కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ మరియు మెస్ పనులు కూడా చేయవలసి వస్తుందన్నారు. శ్రమను గౌరవించడం నేర్పడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమని కవిత పేర్కొన్నారు. ఇక్కడ ఆడియోలో వర్షిని గారు చెప్పిన దాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం టాయిలెట్ కడగడం ఒకటి కాదు. మేడం గారి పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా. అది కూడా రెగ్యులర్‌గా. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదివే పిల్లలు ఏమైనా పోష్ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడం.. ఎందుకు ఇలాంటి పనులు చేయరు చేయాల్సిందే అని ఒక ఐఏఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుండి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు-చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ- ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష, శ్రమ దోపిడీ మాత్రమే అని కవిత అన్నారు. దీంతో పాటు-240 మంది అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించడం కూడా. గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు- ఉండాలి. అంతే కానీ పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం కరెక్ట్ కాదు. నలుగురు శానిటేషన్ వర్కర్స్ ఒక వార్డెన్ మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో కలిపి 1200 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయం. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మరోవైపు అత్యవసరమైన చోట వారిని తొలగించి ఆ పని భారం విద్యార్థుల మీద ఉంచడం తప్పు అని కవిత పేర్కొన్నారు. పోష్ పిల్లలు కాకపోయినా అందరూ పిల్లలు సమాజం దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో సమానమే అన్న సంకేతాలను పంపాల్సిన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదు. ఎస్సీ వర్గాల పిల్లలు ప్రధానంగా చదివే గురుకుల పాఠశాలలో ఈ నిర్ణయం మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించవలసింది. కాంగ్రెస్ ప్రభుత్వ పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను, తక్షణమే ఆ అధికారిని తప్పించాలి, నెలకు మెయింటెనెన్సు డబ్బులు పాఠశాలలకు ఇవ్వాలి. పిల్లలతో పనిచేయించటం ఆపివేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

## సరిహద్దు రాష్ట్రాల్లో నేడు మాక్ డ్రిల్స్

- **హర్యానాలో రాత్రికి బ్లాక్ అవుట్**

**న్యూఢిల్లీ,మే 28( వెలుతురు):**

సరిహద్దు రాష్ట్రాల్లో మరోమారు గురువారం మాక్ డ్రిల్స్ నిర్వహించ బోతున్నారు. పాక్‌తో యుద్ధం ఆగినా.. రెండు దేశాల మధ్య పరిస్థితులు మాత్రం నివురుగప్పిన నిప్పులాగే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మాక్ డ్రిల్స్ మళ్లీ మొదలవ్వనున్నాయి. గురువారం పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, జమ్మూకాశ్మీర్‌లలో అధికారులు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. హర్యానా ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ' ఆపరేషన్ షీల్డ్' పేరిట మాక్ డ్రిల్స్



నిర్వహించనుంది. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి మాక్ డ్రిల్ మొదలవుతుంది. మొత్తం 22 జిల్లాల్లో అధికారులు మాక్ డ్రిల్స్ నిర్వహించ నున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితులకు సిద్ధంగా ఉండటం కోసం ఈ మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. హర్యానాలోని కీలక ప్రాంతాల్లో రాత్రి 8 గంటల సమయంలో 15 నిమిషాల పాటు- బ్లాక్ అవుట్ ఉండనుంది. విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో నిలిచిపోనుంది. అయితే, హాస్పిటల్స్, ఫైర్ స్టేషన్స్, పోలీస్ స్టేషన్స్‌కు ఇందులో మినహాయింపు ఉంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదులకు, వారికి సాయం చేస్తున్న పాకిస్తాన్‌కు సరైన విధంగా బుద్ధి చెప్పడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. భారత ప్రజలకు యుద్ధం జరగొచ్చంటూ హింట్ ఇచ్చేసింది. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహించింది. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల ఏరివేత మొదలెట్టింది. మే 7వ తేదీన పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై ఎయిర్‌ఫోర్స్ దాడులు చేసింది. దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు చనిపోయారు. ఉగ్రవాదుల్ని చంపటంతో పాకిస్తాన్ తట్టు-కోలేకపోయింది. యుద్ధానికి కాలు దువ్వింది. 3 రోజుల పాటు- యుద్ధం జరిగింది. రెండు దేశాల మధ్య జరిగిన ఈ యుద్ధంలో పాక్ దారుణంగా దెబ్బతింది. చివరకు కాళ్ల బేరానికి వచ్చింది.

# ఎర్తింగ్ తప్పని సరి

- కాంతారావు, ఇంఛార్జ్ సీఈఐజీ.

**హైదరాబాద్ వెలుతురు మే 28:**

విద్యుత్ ప్రమాదాల నియంత్రణ కోసం ప్రతి ఇంట్లోనూ ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, హైదరాబాద్ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్ టి.కాంతారావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా తరచూ ప్రమాదాలు వెలుగు చూస్తుండటం, కరెంట్ షాక్‌కు గురై మృత్యువాత పడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరవాసులకు కరెంట్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్ టి.కాంతారావు విద్యుత్ వినియోగదారులకు పలు కీలక సూచనలు చేశారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాల్లో విధిగా రెండు ఎర్త్‌పిట్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్ 3043 ప్రకారం కనీసం ఒక ఎర్త్ పిట్ అయినా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్‌కు 30 మిల్లీ యామ్స్ ఆర్సీసీబీ/ఈఎల్‌సీబీలను ఏర్పాటు చేసుకోవాలి. త ద్వారా సర్క్యూట్‌లో ఏదైనా కరెంట్ లీకేజీ ఏర్పడినప్పుడు ఆర్‌సీసీబీ/ ఈఎల్‌సీబీలు ఆటోమెటిగ్‌గా ట్రిప్ అవుతోంది. అధిక వేడి, విద్యుత్ హెచ్చుతగ్గులను నియంత్రించేందుకు సరైన కేబుల్ పరిమాణాలను ఎంచుకోవాలి. లైట్ పాయింట్ కోసం 1.5 ఎంఎం, అదే పవర్ పాయింట్లకు, సాకెట్‌కు 2.5 స్క్వైర్ ఎంఎం, ఏసీ కోసం 4 స్క్వైర్ ఎంఎం వైర్లను ఎంపిక చేసుకోవాలి. లోడ్‌ను బట్టి వైరు పరిణామాలను ఫాల్ట్ కరెంట్ ఓల్టేజ్ డ్రాప్‌ను ఎంచుకోవాలి. ప్రతి భవనం ఐఈసీ 62305 ప్రకారం లైటింగ్ కండక్టర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేక ఎర్త్‌ఫిట్ ఉండేలా చూసుకోవాలి. విద్యుత్ సరఫరాకు ముందే విద్యుత్ కాంట్రాక్టర్ సంతకం చేసిన స్వీయ ధృవీకరణ పత్రాన్ని పొంది, విద్యుత్ సంస్థకు సమర్పించాలి. ప్రభుత్వం సర్టిఫై చేసిన ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్లతోనే పనులు చేయించాలి.




# సంపాదకీయం..

## వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి !

వ్యవసాయ రంగంలో కీలక మార్పులు వస్తున్నాయి. రైతులు కూడా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల ను గమనిస్తున్నారు. కొత్త తరహా సేద్యానికి అలవాటు పడుతున్నారు. కేవలం వరిపైనే ఆధారపడకుండా కూరగాయలు, పళ్లతోటల పెంపకం,పాడిపశువుల పెంపకంపైనా శ్రద్ధ పెడుతున్నారు. ఈ క్రమంలో రైతులకు మరింత ఆసరా దక్కాలి. బ్యాంకులు కొర్రీలు లేకుండా రుణాలు ఇవ్వాలి. పంటలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు మారాలి. వారికి వ్యవసాయశాఖ పరంగా అన్ని సూచనలు, సలహాలు అందాలి. అన్నింటికిమించి బీమా సౌకర్యం అందించాలి. ఇలా చిన్నిచిన్న సాయాలుచేస్తే రైతాంగం మరింతగా కష్టపడి దేశ పురోభివృద్దిలో భాగస్వామ్యం కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడులు భారీగా పెరిగాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ముందునుంచి పంటల దిగుబడి పెరుగుతూ వస్తోంది. రైతులు చెమటోడ్చి పంటలు పండిస్తున్నా ఆర్థికంగా మాత్రం ఎదగడం లేదు. పంటలు బాగా పండాయనడానికి ధాన్యం రాశులే దీనికి నిదర్శనం. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్న దృశ్యాలు చూస్తుంటే ఎంతగా ధాన్యం దిగుబడి అయ్యిందో గమనించాలి. ఓ వైపు జోరుగా కొనుగోళ్లు జరుగుతున్నా మరోవైపు తమ ధాన్యం కొనడం లేదని రైతులు ఆందోళనలకు దిగితున్నారు. ఉచిత విద్యుత్‌కు తోడుగా, అందుబాటులో నీరు ఉండడంతో జిల్లాల్లో ధాన్యం దిగుబడులు పెరిగాయి. తెలంగాణ కూడా ఇప్పుడు వ్యవసాయికంగా బాగా పురోగమించిందనే చెప్పాలి. మరోవైపు ధాన్యం దిగుబడిలో ఇప్పటికే అగ్రస్థానం లో నిలిచిందని సిఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా పంటల దిగుబడి పెరిగిందని మంత్రులు అంటున్నారు. వరిదిగుబడి, ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిం దని భారత ఆహార సంస్థ గతంలో చేసిన ప్రకటన తెలంగాణ వ్యవసాయరంగం పురోగమిస్తోందనడానికి సంకేతం. వ్యవసాయ రంగంలో విప్లవం సాధించిన ఘనత ఎలా ఉన్నా, ధాన్యాగారంగా మారడానికి అన్నదాతల కష్టాలను అభినందించాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనడం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ దశలో వ్యవసాయంలో మరో విప్లవాత్మక మార్పునకు తెలంగాణ సర్కారు దృఢ నిశ్చయంతో ఉన్నది. కృష్ణా, గోదావరి, మూసీ నదీ జలాలు పుష్కలంగా లభిస్తున్న తరుణంలో పంట మార్పిడి దిశగా నియంత్రిత సాగు విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నది. గిరాకీ ఉన్న పంటల్నే పండించడం, డిమాండ్ ఉన్నప్పుడే పంటను మార్కెట్‌కు తేవడం.. నియంత్రిత వ్యవసాయం లక్ష్యం. వ్యవసాయానికి పెట్టుబడి సాయం మొదలు విత్తనాల్లో సబ్సిడీ, ఎరువుల్లో రాయితీ సమకూర్చుతున్న ప్రభుత్వం... రైతులు మూస విధానం వీడి మంచి ఆదాయం పొందేలా మేధోమధనం జరిపింది. ఈ మేరకు జిల్లా నేలలకు అనువైన పంటలు వేసి లాభాలు గడించేలా ప్రణాళిక రూపొందిం చింది. ఒకే రకమైన పంటలసాగుతో ధరలు తగ్గి రైతులు నష్ట పోతున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న పంటలకు రైతులు కూడా మొగ్గుచూపు తున్నారు. ఇక అవసరమున్న పంటలను పండించాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగం బహుముఖంగా అభివృద్ధి చెందనుంది. కరోనా కాలం కష్ట సమయంలో ధాన్యాగారంగా, యావద్దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. ఈ విజయం వ్యవసాయరంగ పురోభివృద్దిలో సాధించిన మైలురాయిగా చూడాలి. అయితే ఉభయ రాష్ట్రాల్లో కరువులు, వలసలతో కొండంత కష్టాలతో కుమిలి పోయిన అన్నదాతల జీవితాలు మాత్రం గట్టెక్కడం లేదు. రైతుభరోసా పెట్టుబడి సాయంతో పాటు **24** గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా అవుతున్నా అనేక కష్టాలను ఈదాల్సి వస్తోంది. అన్నింటికి మించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కక పోవడం, సకాలంలో కొనుగోళ్లు చేయకపోవడం వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. యాసంగి దిగుబడిలో మునుపెన్నడూ ఎరుగని రీతిలో వరి దిగుబడి సాధించి రైతులు రికార్డు సృష్టించారు. ఆ తరువాత పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనడంతో అన్నదాతలకు భరోసా దక్కింది. తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన యాసంగి ధాన్యం విలువ పదివేల కోట్ల రూపాయల పై మాటే అని తెలుస్తోంది. యాసంగిలో పండిన వరిధాన్యం సేకరణలో జాతీయస్థాయిలో తెలంగాణది కీలక భాగస్వామ్యమని ఎఫ్‌సిఐ పేర్కొన్నది. ఈసారి అత్యధికంగా **64** లక్షల **50** వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు **90** శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందించారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. **12184** కోట్లు చెల్లించినట్లు ప్రకటించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన **48** గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం రేవంత్ అన్నారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్‌గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండని కూడా సూచించారు. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి **29** శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టాలి. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. అప్పుడే కొన్ని సమస్యలయినా తీరుతాయి. రైతులకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం, కూలీల సమస్యను అధిగమించడం కూడా ముఖ్యం.

# మహాత్ముడు మరిచిపోయిన "దశాబ్దం" అధికారం పోయాకే ఫూలే గుర్తొచ్చాడా?



భారతీయ సామాజిక విప్లవ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే. ఆయన కలం, కల, కదలి వంటి ఆశయాలతో పేదల కోసం, బహుజనుల కోసం, మహిళల కోసం సమాజంలో మార్పు తీసుకురావాలని జీవితాంతం పోరాడిన ఘనతవంతుడు. అణగారిన వర్గాలకు విద్యా వెలుగును అందించాలన్న ఆయన సంకల్పమే ఈ దేశ సామాజిక ఉద్యమాలకు ఆదిపథికంగా నిలిచింది. మొన్న ఆ మహాత్ముని జన్మదినం జరుపుకున్నాము. గతప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆవరణంలో మహాత్మా పూలే విగ్రహం నెలకొల్పడంలో 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ విఫలమైందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇది కేవలంవిగ్రహస్థాపనమరిచిపోవడమే కాదు, నిజమైన బహుజన నాయకుల పట్ల చూపబడిన నిర్లక్ష్యం అనే భావన కూడా వెలువడుతోంది. ఈ విషయంలో ప్రభుత్వ తటస్థతపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.ఇక తాజాగా కల్వకుంట్ల కవిత బీసీలపట్ల చూపుతున్న ప్రేమా, సమానత్వం గురించి గట్టిగా మాట్లాడటం చూస్తే, గతంలో దాని విరుద్ధంగా జరిగింది కదా అనే అనుమానాలు సర్వసాధారణంగా ప్రజలలో కలుగుతున్నాయి. బహుజన నాయకుల పట్ల ప్రేమ అనేది మాటల్లో కాకుండా చర్యల్లో ప్రతిబింబించాలి. అయితే, బీఆర్ఎస్ పాలనలో అలాంటి చర్యలు ఎందుకు కనిపించలేదన్నది గంభీరమైన ప్రశ్న.

### బీఆర్ఎస్ పాలనలో విగ్రహ స్థాపన తటస్థత – నిర్లక్ష్యమా? నిరుద్యోగమా?

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన నాటి నుండి 2023 వరకు పూర్తి స్థాయిలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) పార్టీ తన పాలనలో అనేక మైలురాళ్లను అందుకున్నదని దాని నాయకత్వం గర్వంగా చెప్పుకుంటోంది. కానీ అదే సమయంలో కొన్ని కీలకమైన సామాజిక అంశాలపై ఈ పార్టీ చూపిన నిస్సహాయత, నిర్లక్ష్యం సమాజం నుంచి తీవ్ర విమర్శలకు లోనవుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిబా పూలే గారి విగ్రహం స్థాపన విషయంలో ఈ విమర్శలు మరింత బలంగా వినిపిస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో బహుజనులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు మేజార్టీ జనాభా. వీరిని ప్రాతినిధ్యం వహించే సమాజపరులు – మహాత్మా జ్యోతి రావు పూలే, అంబేడ్కర్, పెరియార్ వంటి వారు. ఈ మహనీయుల జీవితం, ఆలోచనలు ఈ వర్గాల మేధస్సును, చైతన్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అలాంటి సమయంలో బి ఆర్ఎస్ పార్టీయే వారి ప్రతిష్టను సముచిత స్థాయిలో గుర్తించకపోవడం విడ్డూరంగా ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ఇప్పటికే మరెన్నో నేతల విగ్రహాలు ఉన్నాయి. కొందరు స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ నాయకుల విగ్రహాలు అక్కడ కొలువై ఉన్నా, బహుజన ఉద్యమానికి జీవం పోసిన మహాత్ముడు పూలే గారికి స్థానం దక్కకపోవడం గమ్యంగా మారింది. ఇది కేవలం విస్మరణ కాదు – ఇది బాధ్యతరహితమే, బీఆర్ఎస్ బహుజనులకు రాజకీయంగా దగ్గరగా కనిపించాలన్న వ్యూహంతోఎన్నోహామీలు ఇచ్చినప్పటికీ,అనేకసందర్భాలలోవాటిని అమలు చేయడంలో విఫలమైంది. బీసీ గురుకుల పాఠశాలలు, బీసీ కమిషన్‌లు వంటి కొన్ని ప్రకటనలు చేసినా, అవి క్రియాశీల రూపంలో మారకపోవడం ప్రజలలో అసంతృప్తిని కలిగించింది. ఇది కూడా పూలే గారి విగ్రహం స్థాపన విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది.వాస్తవానికి, విగ్రహ స్థాపన అనేది కేవలం ఒక శిల్పకళా ప్రక్రియకాదు–అదిఒకమహానేతకు గుర్తింపు, గౌరవం, బాధ్యత. ఇది ఒక రాజకీయ ప్రకటన కాదు, ఒక సామాజిక చైతన్యాన్ని గుర్తించే చర్య. బీఆర్ఎస్ తనపాలనలో ఈవిషయాన్ని పట్టించుకోక పోవడంవల్ల, ప్రజలలో అనేక అనుమానాలు బలపడుతున్నాయి. ఇదేసమయంలో, బీఆర్ఎస్ నాయకత్వంలోని కొందరు మాత్రం తమ కార్యక్రమాలలో బహుజనుల పేరిట సభలు నిర్వహించడం, నాయకుల చిత్రాలను ఉపయోగించడం చేస్తూ వస్తున్నారు. కానీ అది పూర్తిగా "ఓట్ల కోసం ఊపిరి" అనే విమర్శలకు దారి తీస్తోంది. ఎందుకంటే, నిజంగా మహనీయులను గౌరవించాలంటే వారి విగ్రహాలు పెట్టడం, వారి ఆలోచనల్ని విద్యాపాఠ్యాంశాలలో చేర్చడం,వారిపేరుతోనిధులుకేటాయించడం వంటివి చేయాలి. కానీఆదిశగాబీఆర్ఎస్ ఏమాత్రం ముందడుగు వేయలేదు.ఇంకా గమనించదగిన విషయంఏమిటంటే, అసెంబ్లీ ప్రాంగణంలో విగ్రహం పెట్టడం అనేది కేవలం ఆ పార్టీ నిర్ణయంతోనే నడిచే ప్రక్రియ కాదు. ప్రభుత్వం తలచితే, సంబంధిత విభాగాల అనుమతులతో అతి తక్కువ సమయంలో అది సాధ్యమవుతుంది. అలాంటప్పుడు 10 సంవత్సరాలు గడిచినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడాన్ని ఎలా న్యాయబద్ధీకరించగలం?ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా బహుజన యువత, విద్యార్థులు ఈ విషయంపై మరింత చైతన్యంతో స్పందిస్తున్నారు. సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహనీయులకు గౌరవం ఇవ్వడం ద్వారా నేటి సమాజంలో ఉన్న అసమానతలను ప్రశ్నించే ధైర్యం వస్తుంది.అలాంటి సమయంలో బీఆర్ఎస్ పార్టీ తటస్థంగా వ్యవహరించడం బాధాకరం.

### కల్వకుంట్ల కవిత – బీసీల పట్ల ప్రేమపై సందేహాలు

ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత బీసీల పట్ల చూపుతున్న ప్రేమ, గౌరవ భావన ఊహించని రీతిలో వ్యక్తమవుతోంది. బీసీ నాయకులను స్మరించడమే కాక, బీసీ మహాత్ములపై ప్రశంసలు కురిపించడం, వారి సేవలను గొప్పవిగా కొనియాడడం వంటి చర్యలతో ఆమె మీడియాలో కనిపిస్తూ వస్తున్నారు. కానీ గత 10 సంవత్సరాల పార్టీ పాలనతో ఈ తాజా ప్రేమను పోల్చినప్పుడు ప్రజలలో తీవ్రమైన సందేహాలు, అనుమానాలు ఉదయిస్తున్నాయి.కవిత ఇటీవల బీసీ మహాపంచాయితీ, బీసీ చైతన్యయాత్రలు, బీసీ చరిత్రపరమైన మహానేతలపై ప్రత్యేకమైన కార్యక్రమాల్లోపాల్గొంటూవస్తున్నారు. ఈచర్యలు చూస్తే నిజమైన బీసీ సంక్షేమానికి పాటుపడుతున్న నాయకురాలిగాఆమెను భావించవచ్చు. కానీ, గత పదేళ్ల అధికార కాలంలో ఆమె స్వయంగా లేదా ఆమె పార్టీలోని నాయకులు బీసీల కోసం ఏమి చేశారు? అన్నదే అసలు ప్రశ్న.మహాత్మా జ్యోతిబా పూలే గారి విగ్రహం అసెంబ్లీ ఆవరణంలో నెలకొల్పాల్సిన అవసరాన్ని గుర్తించలేకపోవడం, అంబేడ్కర్ గారి స్ఫూర్తిని నామమాత్రంగా వినియోగించుకోవడం వంటి చర్యలు బీఆర్ఎస్ పాలనలో చోటుచేసుకున్నాయి.కవిత బీసీ నేతల పట్ల చూపుతున్న ప్రేమ నిజమైనదా? లేక రాజకీయ ప్రయోజనాల కోసమేనా? అనే సందేహంజనసామాన్యంలోస్పష్టంగా వ్యక్తమవుతోంది. ఇది ఒకవిధంగా రాజకీయ స్వార్థంతో కూడిన "ప్రయోగాత్మక ప్రేమ"గా భావించబడుతుంది.ఎందుకంటే, 2023 ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీఅధికారంకోల్పోయింది.ఈసమయంలో బీసీ వర్గాలను మళ్లీ ఆకర్షించాలన్న వ్యూహంతోనే ఇటువంటి చర్యలు చేపట్టుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా, తెలంగాణలో బీసీ ఓటు బ్యాంకుదాదాపు 50% కి చేరుకుంటోంది. ఇటువంటి ఓటర్లను మళ్లీ ఆకర్షించాలన్న ఉద్దేశంతో రాజకీయ ప్రేమను ప్రయోగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇంకా ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కవిత అసెంబ్లీ సదస్సుల్లో బహుళ వర్గాల నేతల గొప్పతనాన్ని గుర్తించేందుకు ఎలాంటి చొరవ తీసుకోలేదనే విషయాన్ని బహుజన సంఘాలు గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు ఆమె బీసీల పట్ల అభిమానం చూపిస్తుండటం 'పోస్ట్ డిఫీట్ సింపతీ డ్రైవ్'గా అనిపిస్తోంది.ఇంతకాలం రాజకీయ వేదికలపై బీసీల గురించీ, వారి చరిత్ర గురించీ ప్రత్యేకంగా మాట్లాడని నాయకురాలు ఇప్పుడు ఒక్కసారిగా మహాత్మా పూలే, అంబేడ్కర్, పెరియార్ వంటి నాయకులను ప్రస్తావించడం – నిజంగా విశ్వాసాన్ని నూరిపోసే చర్యగా భావించాలా? లేక ప్రజల మనోభావాలను వినియోగించుకునే ప్రయత్నంగా భావించాలా? అన్నది సామాన్య బీసీ యువతలో తలెత్తే ప్రశ్న.ఇక్కడ అసలు అంశం ఏమిటంటే – బహుజన ప్రేమను మాటల్లో చూపించడం కాదు, చర్యల్లో చూపించాల్సిన అవసరం. ఒకవేళ నిజంగా బీసీల పట్ల ప్రేమ ఉందన్నా, ఇప్పటికైనా కవిత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మహాత్మా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణంలో నెలకొల్పే ప్రయత్నం చేయాలి. అలాగే, బీసీ విద్యార్థుల కోసం ప్రత్యేక నిధులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు వంటి అంశాలపై ఉద్యమాలు చేయాలి. అప్పుడే ఆమె మాటలకు బలం వస్తుంది.ఈ విషయంలో సమాజం చాలా స్పష్టంగా ఆలోచిస్తోంది. ప్రజలు ఇప్పటికీ అవగాహన లేని స్థితిలో లేరు. వారికీ ఎవరు నిజంగా వారి కోసం పనిచేస్తున్నారో, ఎవరు మాటలతో మభ్యపెడుతున్నారో తెలుసుకునే సామర్థ్యం ఉంది. కవిత ప్రేమ నిజమైనదైతే, అది కార్యరూపం దాల్చాలి. లేకపోతే, అది కూడా ఓ ఎన్నికల హడావుడిలో మాటల మోజుగా మిగిలిపోతుంది.

### జాతీయ పార్టీల హస్తక్షేపం – జాన్ వెస్లీ స్పందన

తెలంగాణ రాజకీయాల నేపథ్యంలో మహాత్మా జ్యోతిబా పూలే గారి విగ్రహం అంశం కేవలం ప్రాంతీయ పార్టీ స్థాయిలో కాకుండా జాతీయ పార్టీల దృష్టిని కూడా ఆకర్షించింది. ఈ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) – సీపీఎం – రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్పందన ప్రత్యేకంగా గుర్తించదగ్గది.జాన్ వెస్లీ మద్దతుగా వచ్చిన తీరు, ఆయన ఉపయోగించిన భాష ఇవన్నీ ఓ నిజాయితీ ఉన్న సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తున్నాయి. "తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా పూలే గారి విగ్రహం లేకపోవడం దౌర్భాగ్యకరం. ఇది కేవలం ఒక విగ్రహ స్థాపన అంశం కాదు – ఇది బహుజనుల చరిత్రను గుర్తించే సామాజిక నైతికతకు సంబంధించిన విషయం," అని ఆయన చెప్పిన మాటలు బహుజన సమాజానికి బలాన్నిచ్చాయి.ఇది కేవలం ఒక రాజకీయ ప్రకటనగా కాక, బహుళ జనవర్గాలచరిత్రపట్ల గల గౌరవాన్ని చూపించేందుకు చేసిన నిజమైన ప్రయత్నంగా పలువురుభావిస్తున్నారు. ముఖ్యంగా, కమ్యూనిస్టు పార్టీల చరిత్రలో సామాజిక న్యాయానికి ఉన్న ప్రాధాన్యతను చూస్తే, జాన్ వెస్లీ స్పందన అర్థవంతంగా అనిపిస్తుంది.సిపిఎం తో పాటు అనేక రాజకీయ పార్టీల అధ్యక్షతన కంచె ఐలయ్య, జాన్ వెస్లీ, టీమాస్ ఏర్పాటు చేసి అందులో భాగంగా అన్ని కులాలకు సమాన వాట రావాల్సిందే రాజకీయాల్లో అని ఆనాడు టీమాస్కు కార్యదర్శిగా పనిచేశాడు. అందులో భాగంగా ప్రతి కులానికి సామాజిక వాటగా బిఎల్ఎఫ్ టికెట్లు ఇచ్చింది. బీఆర్ఎస్ మరియు ఇతర పెద్ద పార్టీల మౌనాన్ని, తటస్థతను ప్రశ్నిస్తూ జాన్ వెస్లీ మాట్లాడడం ఒక సాహసోపేతమైన చర్య. ప్రత్యేకించి బహుజన నేతలకు గుర్తింపు ఇచ్చే విషయంలో ఇప్పటివరకు పార్టీలు తీసుకున్న వైఖరిని ఆయన బహిరంగంగా ప్రశ్నించారు. ఇది సామాజిక చైతన్యానికి ప్రేరణగా మారింది. ఈ నేపథ్యంలో, పూలే విగ్రహ స్థాపన కోసం ఉద్యమాలు చేస్తున్న బహుజన సంఘాలకు జాతీయ స్థాయి పార్టీ నుంచి మద్దతు రావడం ఒక మైలురాయి. ఇది అంశాన్ని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు దోహదపడుతుంది. జాన్ వెస్లీ స్పందనతో పాటు, ఇతర జాతీయ నాయకులు కూడా ఈ అంశంపై స్పందించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే మహాత్మా పూలే గారి అవధానం ఒక రాష్ట్రానికి పరిమితమైనది కాదు. ఆయన సమాజానికి చేసిన సేవ భారతదేశచరిత్రలో అపూర్వమైంది. అలాంటి మహానేతకు సన్మానం ఇవ్వడంలో ఆలస్యం తలచనీయదగిన విషయం.ఇకపై ఈ ఉద్యమం కేవలం తెలంగాణ రాజకీయ పరిమితుల్లో కాకుండా జాతీయ స్థాయికి ఎదగాలి. సిపిఎంఅందించిన మద్దతు ఈ దిశగా కీలక అడుగు. ఇక రాష్ట్ర ప్రభుత్వం, మిగతా పార్టీలు ఈ సందేశాన్ని ఎలా స్వీకరిస్తాయన్నదే వేచిచూడాల్సిన అంశం.

### బీసీ మహాత్ముల గౌరవానికి రాజకీయ ప్రాముఖ్యత:

భారతదేశ రాజకీయ చరిత్రలో బహుజనుల పాత్ర అమోఘమైనది. వారు కేవలం ఓటర్లుగా పరిమితం కాకుండా, ఉద్యమాల యోధులుగా, సామాజిక మార్పుల పురోగాములుగా, వంచిత వర్గాలకు ఆశాజ్యోతిలాగా నిలిచారు. ఈ మార్గదర్శకులలో మహాత్మా జ్యోతిబా పూలే వంటి నేతలు తమ జీవితాన్నే బహుజనుల కోసం అంకితమిచ్చారు. అలాంటి మహనీయుల గౌరవానికి రాజకీయ వ్యవస్థలో తగిన స్థానం లేకపోవడం, అది మాటలకే పరిమితమవడం – సమాజం ఎదుగుదలకు పెద్ద అడ్డంకిగా మారుతుంది.బీసీ మహాత్ములు సాధించిన ఉద్యమ విజయాల ప్రభావం ఇప్పటికీ అనేక వర్గాలలో కనిపిస్తుంది. పూలే గారు మహిళా విద్య, శుద్ధ మజ్జి వృత్తుల ప్రాముఖ్యత, అణగారిన వర్గాలకు సమానావకాశాలపై తన జీవితం మొత్తం సమర్పించారు. ఇలాంటి నేతలను గుర్తించకపోతే, నేటి పాలకులు సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత కోల్పోతారు. ఎందుకంటే న్యాయం అనేది భావన మాత్రమే కాదు – అది చరిత్రను గుర్తించి గౌరవించడంలో మొదలవుతుంది. ఇప్పటి వరకు దశాబ్దాల పాలన చూసినట్లయితే, బీసీ నేతల పేరుతో సభలు, ర్యాలీలు, మేళాలు నిర్వహించినా, నిబంధిత స్థాయిలో గౌరవం ఇచ్చిన సందర్భాలు అరుదే. అసెంబ్లీలు, పార్లమెంట్లు వంటి ప్రజాప్రతినిధుల గౌరవ ప్రాంగణాలలో అగ్రవర్ణ నాయకుల విగ్రహాలకే ఎక్కువ ప్రాధాన్యత లభించడం, ఇది అధికార వ్యవస్థ ఎంత వరకు వర్ణవ్యూహానికి లోబడి ఉందో చాటుతుంది. ఇక్కడే బీసీ మహాత్ముల గౌరవానికి రాజకీయ ప్రాధాన్యత ఉద్భవిస్తుంది. ఒకవేళ ఈ మహనీయులను అధికార వ్యవస్థ గుర్తించి గౌరవించకపోతే, ప్రజలలో విభజన, అసమానత ఇంకా పెరుగుతాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకం. పైగా బీసీలు దేశంలో ఓటు బ్యాంకుగా మారినప్పుడు, వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవడం రాజకీయాలకు తప్పనిసరి అవుతుంది. ఒకవేళ మహాత్మా పూలే గారి విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో నిలిపితే, అది కేవలం ఓ శిల్పం కాదు. అది బహుజన చరిత్రకు ఇచ్చిన గౌరవం. రాజకీయాల్లో "బహుజన ఓటు" గురించి మాట్లాడే ప్రతి పార్టీ, వారి అభిమానం నిజమైనదని చూపించాలంటే, ఇలా చారిత్రక గుర్తింపులకు చర్యల ద్వారా విలువ ఇవ్వాల్సిందే. ప్రజలు ఇప్పుడు "ఓటు కోసం ప్రేమ" అనే రాజకీయ నాటకాలను గుర్తించగలుగుతున్నారు. అందుకే, నిజమైన బహుజన గౌరవం అంటే మాటల్లో కాకుండా పాలనలో ప్రతిబింబించాలి. వీరి చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి, విగ్రహాలు ఏర్పాటు చేయాలి, స్మారక చిహ్నాలు నిర్మించాలి. ఇది ఓటుకు ముందు హామీగా కాకుండా, పాలనలో ఒక భాగంగా చేయాలి. ఒక సందర్భంలో డాక్టర్ అంబేడ్కర్ గారు అన్నట్లు – "వివేకాన్ని వదిలిపెట్టి ఒక సమాజం ముందుకు సాగదు." అదే విధంగా, బీసీ మహానేతలను గౌరవించని సమాజం వాస్తవానికి ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచలేను. గౌరవం అనేది ఒక బాధ్యత. బీసీ మహానేతలకు న్యాయం చేయడం అనేది సామాజిక సమగ్రతకు నిదర్శనం. అది ఒక కులం గౌరవం కాదు – అది సమాజాన్ని మెరుగుపరిచే తత్వాన్ని గుర్తించే ప్రక్రియ.ఈ క్రమంలో రాజకీయ పక్షాలు తమ వ్యవహారాన్ని పునఃపరిశీలించుకోవాలి. ఎన్నికల సమయంలో మాత్రం బీసీలతో అనుబంధం చూపించి, అధికారంలోకి వచ్చాక మౌనంగా ఉండడం ఓ దురలవాటు అయింది. దీన్ని మార్చాల్సిన అవసరం ఉంది. నిజమైన మార్పు కోసం నాయకులు స్వచ్ఛమైన మనస్సుతో ముందుకు రావాలి. అప్పుడే బీసీ మహనీయులకు నిజమైన గౌరవం లభిస్తుంది.మహాత్మా జ్యోతిబా పూలే గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఒక్కటే సమాజం నుండి రాజకీయాలకు వెళ్లే స్పష్టమైన సందేశానికి నిదర్శనం. ఇది ఓ వ్యక్తికి ఘనత ఇవ్వడం కాదు ఓ తత్వాన్ని గౌరవించడం. పూలే గారి విగ్రహం ఇప్పటికైనా తెలంగాణ నూతన రాజకీయ దృక్పథానికి మార్గదర్శకంగా నిలవాలి. ప్రజల మనోభావాలకు స్పందనగా ప్రభుత్వం స్పందించాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిపూర్ణంగా పుష్పిస్తుంది.నిలవాలన్న సంకల్పాన్ని.ఈ నిర్ణయం ప్రజల మదిలో కాంగ్రెస్ పట్ల నమ్మకాన్ని పెంచే అవకాశాన్ని కల్పిస్తుంది. పూలే ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.



తెలంగాణ లోక్సత్తా పార్టీ
రాష్ట్ర అధ్యక్షుడు
95508 44433

## వైద్యో నారాయణ హరి అనే పదానికి ప్రతిరూపం శంకర్పల్లి స్వర్గీయ డాక్టర్ నరసింహారెడ్డి



**శంకర్ పల్లి వెలుతురు మే28**

సేవా ఫౌండేషన్ కార్యాలయం వద్ద స్వర్గీయ డాక్టర్ నరసింహారెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న శంకర్పల్లి సేవా ఫౌండేషన్ సభ్యులు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా నరసింహారెడ్డి గారు రోగులకు చేసిన వైద్య సేవలు అమోఘమని కొనియాడారు. నేటి ప్రస్తుత కాలంలో విద్యారంగం వైద్యరంగం డబ్బుతో ముడిపడి ఉందని కానీ డాక్టర్ నరసింహారెడ్డి గారు మాత్రం నీతి నిజాయితీగా ఒక నిజమైన వైద్యుడి భావన ఎలా ఉంటుందో అలా రోగానికి తగ్గ మందులు మాత్రమే ఇచ్చి తన మానవత్వ విలువలను చాటమనేది వర్ణాతీతం అని తెలిపారు. ప్రస్తుత కాలంలోని కొద్ది మంది డాక్టర్లు ధనార్జనే ధ్యేయంగా రోగుల పట్ల అధిక డబ్బులు తీసుకుంటున్న సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలిసిన విషయమే అని గుర్తు చేశారు. అయితే డాక్టర్ నరసింహారెడ్డి చివరి శ్వాస వరకు వైద్య విలువలను కాపాడుతూ భావితరం వైద్యులకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ అని నరేష్ కుమార్ పిలుపునిచ్చారు. కాబట్టి నేటితరం డాక్టర్లు అందరూ నరసింహారెడ్డి సేవలను స్ఫూర్తిగా తీసుకొని డాక్టర్ల పుట్టినరోజులకు గాని తమ కుటుంబ సభ్యులు అమ్మ నాన్నల జయంతులకు గాని ఆసుపత్రులకు వచ్చిన రోగులకు రోగం తగ్గ వైద్యమే చేసి మానవతను చాటాలని శంకర్పల్లి సేవా ఫౌండేషన్ తరపున డాక్టర్లందరికి నమస్కరిస్తూ విజ్ఞప్తి చేస్తున్నానని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ వేనేంద్ర చారి, మాజీ వార్డ్ మెంబర్ ఎం నాగమణి,ఫౌండేషన్ సభ్యులు కండక్టర్ రాజు, కరాటే రవి, వైభవ్, శ్రీరాములు, మురళీకృష్ణ, లక్ష్మి, కస్తూరి, కృష్ణ,సార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగువారి గుండెలో చిరస్మరణీయుడు ఎన్టీఆర్...

- పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ..



**కూకట్ పల్లి మే 28 వెలుతురు:**

సూర్య చంద్రులు ఉన్నంత వరకు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన మాహానుభావుడు, విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, నటరత్న, పద్మ శ్రీ స్వర్గీయ డా. నందమూరి తారక రామారావు అని పిఏసి చైర్మన్ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. బుధవారం తెలుగుజాతి ఇలవేలుపు, మరణం లేని జననం,తెలుగుజాతి కీర్తి మకుటం, తెలుగునేల ముద్దుబిడ్డ, తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తో కలిసి పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో, విశ్వ విఖ్యాత నట సార్వాభౌమునిగా యావత్ ప్రపంచానికి ఆయన ఒక కళా ప్రవీనుడిగా, కుల, మత బేధం లేకుండా అందరి అభివృద్ధి కోసం కృషి చేసిన సాక్షాత్ భగవత్ స్వరూపుడుగా ఎన్టీఆర్ ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. రాజకీయాలకు నూతన నిర్వచనం ఇచ్చి కోట్లాది జీవితాలలో వెలుగు నింపిన మహనీయుడు, పార్టీ స్థాపించి 9 నెలల్లోనే అధికారం కైవసం చేసుకొని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు వెళ్లారని, యువతకు రాజకీయ అవకశాలు కల్పించి కొత్త అధ్యాయం ఎన్టీఆర్ సృష్టించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వీధి అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, నాయకులు, అభిమానులు, శ్రేయాబిలాషులు, ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగువారి ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం ఎన్టీఆర్...

- పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ...



**కూకట్ పల్లి మే 28 వెలుతురు:**

తెలుగు వారి గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని పిఏసి చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ లో పద్మ శ్రీ, స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహానికి కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్, నార్నె శ్రీనివాస రావులతో కలిసి గాంధీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా గాంధీ మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర చిరస్థాయిగా వేసుకున్న నాయకుడు, విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, నటరత్న, పద్మ శ్రీ స్వర్గీయ డా. నందమూరి తారక రామారావు అని, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో, యావత్ ప్రపంచానికి ఆయన ఒక కళాప్రవీనుడిగా, కుల,మత బేధం లేకుండా అందరి అభివృద్ధి కోసం కృషి చేసిన సాక్షాత్ భగవత్ స్వరూపుడుగా రామారావు ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. రాజకీయాలకు నూతన నిర్వచనం ఇచ్చి కోట్లాది జీవితాలలో వెలుగు నింపిన మహనీయుడు, పార్టీ స్థాపించి 9 నెలల్లోనే అధికారం కైవసం చేసుకొని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు వెళ్లారని అన్నారు. తెలుగువాడి కీర్తిని నలుదిశలా ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అన్నారు. పేదవాడు బ్రతకడానికి కనీస అవసరాలైన తిండి, గూడు, బట్ట అని నమ్మి వాటిని కల్పించి వారి జీవితాలలో వెలుగు నింపారని, అభివృద్ధి ,సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందించిన పరిపాలన దక్షకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, శ్రేయాబిలాషులు, ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్ట రక్షణకై,కూలీల సమస్యల సాధనకై మే 30న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 28 :**



ఉపాధి హామీ చట్టరక్షణకై కూలీల సమస్యల సాధనకై డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి బొజ్జ బాలయ్య డిమాండ్ చేశారు బుధవారం రోజున యాదాద్రిభువనగిరి జిల్లా, చౌటుప్పల మండల పరిధిలోని తూప్రాంపేట మల్కాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశంలో జరిగిన కూలీల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేదలు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య పోరాటం తోపాటు వామపక్షాల ఒత్తిడి మేరకు యూపీఏ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి వందరోజుల పని గ్యారంటీ కోసం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సాధిస్తే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా నిధులను క్రమక్రమంగా తగ్గిస్తూ ఎత్తివేయాలని కుట్ర చేస్తుందన్నారు, గత సంవత్సరం 2.50 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా 90 వేల కోట్లు ఖర్చు చేసిన పాలకులు ఈ సంవత్సరం 86 వేల కోట్ల రూపాయలకు తగ్గించిందన్నారు దీంతో కూలీల జాబ్ కార్డులు, పని దినాలు పెద్ద ఎత్తున తగ్గించడం జరుగుతుందన్నారు . పథకం ప్రారంభంలో 2005 సంవత్సరంలో కూలీలందరికీ పనిముట్లు గడ్డపార, పార, తట్ట, గొడ్డలి లాంటివి ఇస్తామని చెప్పి కేవలం కొద్ది మంది కూలీలకు ఇచ్చి, గత పది సంవత్సరాలుగా కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదని, పనిచేసే చోట టెంటు మరియు మంచినీళ్లు ఏర్పాటు చేయడం లేదని, వారం వారం రావలసిన కూలీ డబ్బులు 5, 6 వారాలుగా పెండింగ్ లోనే ఉంటున్నా యని దీంతో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, ప్రభుత్వం నిర్ణయించిన 307 రూపాయలు ఎవరికి అందని పరిస్థితిలో ఏర్పడ్డాయని కేవలం 150 నుండి 200 కు మించడం లేదని, కొలతలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు, పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో కూలీలు తమకు ఎంత కూలి చెల్లిస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు, ప్రభుత్వం వెంటనే ఈ సమస్యల పరిష్కారం కోసం దిగి వచ్చే విధంగా మే నెల 30 న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తున్నామని ఈ ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని, తమ డిమాండ్ల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి మీసాల శీను, మండల కమిటీ సభ్యులు గుండ్ల మహేష్, మంచిని పద్మ, సోమ పద్మ, బద్రి నీలమ్మ, తనగల దేవి పెరుమళ్ళ పావని, శ్రీపతి భారతమ్మ, ఈదుల కలమ్మ, బండారి వసంత, సంగం వినోద తదితరులు పాల్గొన్నారు .

## తెలుగు ఖ్యాతినీ ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్..

- మందలపు సాయిబాబా చౌదరి



**కూకట్ పల్లి మే 28 వెలుతురు:**

తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, కెపిహెచ్బి డివిజన్ టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబా చౌదరి అన్నారు. బుధవారం ఎన్టీఆర్ 102 వ జయంతిని పురస్కరించుకొని కెపిహెచ్బి డివిజన్లోని వసంత నగర్ కాలనీలో గల ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వసంత నగర్ మహిళల ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, పారిశుధ్య కార్మికులకు టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా చౌదరి మాట్లాడుతూ యుగ పురుషుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచారని ఆ మహానుభావుడి ఆశీస్సులతో తాను రాజకీయంలోకి రావడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో సేవే లక్ష్యంగా ప్రజల కోసం నిరంతరం పాటుపడుతూ ఆ మహానుభావుడి అడుగుజాడల్లో నడుస్తూ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మధు, సత్యనారాయణ, సాంబశివరావు, శ్రీనివాస్ బాబు, మహిళా మండలి అధ్యక్షులు పద్మ, సీత, భవాని తదితరులు పాల్గొన్నారు.

## పట్టు వస్త్రలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 28**

మండలం మునిపంపుల గ్రామానికి చెందిన మేకల రాములు కుమార్తెల పట్టు వస్త్రలంకరణ కార్యక్రమం రామన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెస్ గార్డెన్ లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ ఎంపీటీసీలు గాదే పారిజాత, సాల్వేర్ అశోక్, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, ఎస్కే చాంద్, మాజీ సర్పంచ్ దోగ్గిపర్తి జానకి రాములు, గ్రామ శాఖ అధ్యక్షుడు మామిళ్ల అశోక్, నాయకులు మామిళ్ల కుమార్, వల్లమళ్ల సూర్యప్రకాష్, వంగాల బాబు, సండ్ల నరసింహ, శంకర్ మల్లయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# సిపిఐ పల్లివాడ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శిగా జంపాల అంజయ్య.

## సహాయ కార్యదర్శిగా కళ్ళెం బిక్షం ఏకగ్రీవం.

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 28**

సిపిఐ పార్టీ పల్లివాడ గ్రామ 15వ మహాసభలో పల్లివాడ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శిగా జంపాల అంజయ్యను,సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ్మా తెలియజేసారు. జంపాల అంజయ్య ఇంటి ఆవరణలో జరిగిన సిపిఐ పార్టీ 15వ గ్రామ మహాసభ సిపిఐ సీనీయర్ నాయకులు కళ్ళెం దశరథ అధ్యక్షతన జరిగింది, ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ్మా,సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ లు హాజరై మహాసభలో పల్లివాడ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శిగా జంపాల అంజయ్యను,సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలియజేసారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో పరిపాలన అస్థవ్యస్థంగా ఉందని ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు మంచిగనే ఉన్నా వాటి అమలు విషయంలో పేదవారికి అన్యాయం జరగకుండా చూడాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అసలు ఇల్లులేని వారికి మొదట ఇవ్వాలని, ఫించన్లు అప్లై చేసుకున్నా చాలా మందివి ఇంకా పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరితగతిన ఇవ్వాలని, గత ప్రభుత్వం 10 ఏండ్లు పాలించినా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులు ఇప్పుడు అందరికి ఇవ్వడం సంతోషదాయకమని, సన్నబియ్యం గ్యారంటీ పథకాలలో లేకున్నా అమలు చేస్తున్నారని,రాజీవ్ యువ వికాస్ తో యువతకు ఉపాధి కల్పించే ప్రయత్నం చేయడం మంచిదేనని, ఉన్న బడ్జెట్ తో ప్రభుత్వాన్ని నడుపుతూ, బడ్జెట్ తక్కువ ఖర్చు ఉన్న పథకాలను అమలు



చేస్తూ, ఎక్కువ బడ్జెట్ ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేసినా చాలు గాని, నిజమైన పేద లబ్ధిదారులకు చేరేలా ఉండాలని, పథకాలు అనేవి అవసరమైన వారికోసం పెట్టేలా ఉండాలని తద్వారా బడ్జెట్ కూడా తక్కువ అవుతుందని, అంతేగానీ పథకాలు పెట్టిన తర్వాత లబ్ధిదారులను ఎంచుకోవడం సరైనది కాదని తద్వారా అవసరం ఉన్నవారికి పథకాలు చేరే అవకాశం ఉండదని,ఇది అందరు గమనించవలసిన విషయమని వారు ప్రభుత్వానికి సూచించారు. ఈ మహాసభలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్,సిపిఐ మండల కార్యవర్గసభ్యులు రచ్చ యాదగిరి, ఏనూతుల రమేష్, కడమంచి జగన్నాథం, రామచంద్రం, యాదగిరి, యాదయ్య, నర్సింహ్మా, కళ్ళెం రాజు , సీతారాములు,అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



# జనహిత అన్నపూర్ణ 340 వ అన్నదాన కార్యక్రమం.

- కీ.శే. మారపల్లి రవీందర్ రెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ కేంద్రంలోని కాంటా చౌరస్తాలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం జనహిత అన్నపూర్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. తేదీ 28.05.2025 బుధవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 340 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలి తో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 13 వ తేదీ 2021 న ప్రారంబించడం జరిగిందని దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ రోజు 340 వ సారి దాత కీ.శే. మారపల్లి రవీందర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు యాచకులకి, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమం లో సుమారు 180 మందికి అన్నదానం చేయడం జరిగిందని ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కొరకు మరింత మంది దాతలు ముందుకు రావాలని అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల రమాదేవి, కార్యవర్గ సభ్యులు పాతకాల కుమార్, నిచ్చకోల గురుస్వామి,వాలింటర్ రాచకొండ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి కీర్తి రాజ్వీరు

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాల ఎంపిక కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి కీర్తి రాజ్వీరు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశం దరఖాస్తులు స్వీకరించడం కొరకు 1వ తేదీన సిద్దిపేటలోని వాలీబాల్ అకాడమీలో, 10వ తేదీన రాజన్న సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీలో, 10, 11 తేదీలలో ఓ.యు. క్యాంపస్లోని సైక్లింగ్ వెల్డ్రోమ్లొని సైక్లింగ్ %ఒ% రెజ్లింగ్ అకాడమీలో, హన్మకొండలోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్లో, 12వ తేదీన వనపర్తిలోని హాకీ అకాడమీ, ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీ, 12, 13 తేదీలలో మహబూబ్నగర్లోని వాలీబాల్ అకాడమీలో కొంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు తమ జనన ధృవీకరణ పత్రం, స్పోర్ట్స్ సంబంధించిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ధృవపత్రాల నకలు ప్రతులతో సంబంధిత అకాడమీలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 9963539234 నంబర్లో సంప్రదించాలని, అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**

మంచిర్యాల జిల్లాలోని నెన్నెల మండలంలో ఎర్రవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండలంలో కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు, ఇందిరమ్మ ఇండ్లు, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహశిల్దార్ మహేంద్రనాథ్ కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం రాబోతుందని, ఈ నేపథ్యంలో మండలంలోని ఎర్రవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మండలంలోని జంగల్ పేటలోని కొత్తగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నిరుపేదల కొరకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పథకం ఫలాలు అందే విధంగా జాబితా రూపకల్పనలో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ ప్రాంతంలో అటవీ శాఖ అభ్యంతరం చెబుతున్న భూములను పరిశీలించి వాటికి సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. అనంతరం జోగాపూర్, ఆవుడం గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు వారికి కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవేందర్రెడ్డి, ఎస్.ఐ., మండల పంచాయతీ అధికారి, ఎ.పి.ఓ., ఎ.పి.ఎం., ఆర్.ఐ., కార్యదర్శులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల కారణంగా నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**



వర్షాకాలం సమీపిస్తున్నందున భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో జిల్లాలోని చెరువులు పూర్తి స్థాయిలో నిండి పంటలకు, ప్రజలకు ఎలాంటి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో నీటి పారుదల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లాలో కురిసే భారీ వర్షాల కారణంగా జిల్లాలోని చెరువులు నిండి గండి పడే ప్రమాదం ఉన్నందున అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. చెరువుల కారణంగా పంట నష్టం, రహదారులు తెగిపోవడం వంటి ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తత చర్యలు తీసుకోవాలని, చెరువులు 90 శాతం నిండిన యెడల సంబంధిత అధికారిక గ్రూప్లో సమాచారం అందించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటి పారుదల శాఖ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని నీల్వాయి ప్రాజెక్టు, కరకట్ట నిర్మాణ పనుల పురోగతి వివరాలు తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని నీటి ప్రాజెక్టులలో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎల్లంపల్లి ప్రాజెక్టులో సరిపడా నీటి మట్టం ఉందని, త్రాగునీటికి జిల్లాలో ఎలాంటి కొరత లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల ఎస్.ఈ. విష్ణుప్రసాద్, మంచిర్యాల, చెన్నూర్ డివిజన్ల డి.ఈ. ఈ.లు, ఎ.ఈ.ఈ.లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్ చీఫ్ వార్డెన్ గా మేడి శ్రీనివాస్

- సత్కరించిన కుటుంబ సభ్యులు



**చిట్యాల వెలుతురు న్యూస్ మే 28**

ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్ హాస్టల్ కి చీఫ్ వార్డెన్ గా మేడి శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్నలు అయిన మేడి వెంకటేష్, రమేష్ మేడి లు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీనివాస్ స్వస్థలం నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, వట్టిమర్తి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మేడి లింగయ్య - మారమ్మ లకి మూడవ సంతానం. పెద్ద అన్న వెంకటేష్ ప్రభుత్వ ఉపాధ్యాయులు, రెండవ అన్న రమేష్ మేడి ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఏడిఈ గా విధులు నిర్వహిస్తున్నారు. చివరి వారైనా శ్రీనివాస్ చీఫ్ వార్డెన్ గా ఎంపికవ్వడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# పలు శుభకార్య కార్యక్రమంలో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 28**

మునిపంపుల గ్రామానికి చెందిన గాదె రాములు కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.బోగారం గ్రామానికి చెందిన కూనురు మహేశ్ కుమార్తె, కుమారుడిల నూతన పట్టువస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ స్థానిక ఎన్నికలపై లేదా
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 28**

రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న ధ్యాస స్థానిక ఎన్నికలపై సంస్థల ఎందుకు లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరం నర గడుస్తున్నా, ఇప్పటికి ఎన్నికలు నిర్వహించకపోవడంతో, గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు.నిధులు రాక అభివృద్ధి లేక పాలన కుంటుపడిందన్నారు. గ్రామాల్లో మౌలిక సమస్యలు పేరుకుపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా పాలన అని ప్రచారానికే ప్రభుత్వం పరిమితమయ్యిందని హెద్దేవా చేశారు. ఆడంబరంగా అందాల పోటీలు నడుపుతున్న రేవంత్ ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించే సోయి లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్లూరి అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు,కల్లూరి నగేష్,గొరిగె సోములు,నాగటి ఉపేందర్, ఎండీ రఫీక్, అవనగంటి నగేష్, మేడి గణేష్, బోడిగె రజిత తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 3 నుండి ఎస్.ఎస్.సి. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

- జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**

జిల్లాలో జూన్ 3వ తేదీ నుండి ఎస్.ఎస్.సి. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3, 4, 5, 6, 11, 12, 13 తేదీలలో ఉదయం 9.30 గం.ల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు, 3వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1, 2 పరీక్ష ఉదయం 9.30 గం.ల నుండి మధ్యాహ్నం, 12.50 గంఎల వరకు, 9, 10 తేదీలలో ఉదయం 9.30 గం.ల నుండి 11 గం.ల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బంది నియామకం, పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులు నడపడం, ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

## కొర్రమీను సాగుకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్


**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**

జిల్లాలోని మత్స్య పరిశ్రమలో పని చేస్తున్న అర్హులైన వారి నుండి కొర్రమీను సాగు చేసేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బెస్తావారికులు / మత్స్యకారులు, మత్స్యరైతులు/ హోల్ సేల్ / రిటైల్ చేపల విక్రయదారులు / చేప పిల్లలు ఉత్పత్తి చేయువారిలో ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లాను ముర్రెల్ క్లస్టర్ గా ఏర్పాటు చేసేందుకు గుర్తించడం జరిగిందని, ఇప్పటికే జిల్లాలో కొర్రమీను సాగు చేస్తున్న / చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా సాధారణ 40 శాతం, ఎస్.సి. / ఎస్.టి. / మహిళ క్యాటగిరి 60 శాతం రాయితీపై 3 హెచరీ యూనిట్లు, 10 హెక్టార్లు చేపల పెంపకం చెరువులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర సమాచారం కొరకు జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-8లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.


# రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా 50 వేల రూపాయల నుండి 1 లక్ష రూపాయల యూనిట్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో మొదటి విడత మంజూరు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, ఇతర వెనుకబడిన తరగతుల వర్గాలలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులకు అవకాశం కల్పించడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనిట్లు కలిపి 4 లక్షల 93 వేల 234 మంది లబ్ధిదారులకు 6 వేల 250 కోట్ల రూపాయల సహాయాన్ని అందించడం జరుగుతుందని, జూన్ 2వ తేదీన దాదాపు 85 వేల మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జూన్ 2వ తేదీ సాయంత్రం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున అన్ని నియోజకవర్గ కేంద్రాలలో 50 వేల రూపాయల నుండి 1 లక్ష రూపాయల వరకు గల యూనిట్ల లబ్ధిదారులకు ఆయా నియోజకవర్గాల శాసనసభ్యుల ద్వారా మంజూరు పత్రాలు అందించాలని తెలిపారు. రాష్ట్రంలోని అర్హత గల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని చేపట్టిందని, ఈ క్రమంలో అర్హులకు యూనిట్లు కేటాయించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించి రాష్ట్ర జి.డి.పి.ని పెంపొందించాలని తెలిపారు. యూనిట్లు పొందిన లబ్ధిదారులకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని, పథకం అమలులో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాను జిల్లా ఇన్చార్జ్ మంత్రి అందించాలని, జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు సాయంత్రం 4 గంటలకు నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ్యులతో యూనిట్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, షెడ్యూల్ కులాల సహకార సంస్థ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జనార్దన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





బుధవారం రోజున సత్తుపల్లి నందు తెలుగు వారి ప్రియతమ నేత మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు గారి జన్మదిన కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్

**సత్తుపల్లి వెలుతురు మే 28:**

## నాటి వాటిని సురక్షితముగా పెంచేటట్లు చూసే బాధ్యత ప్రతి ఒక్కరిది

- కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు మే 28:**



బుధవారం రోజున హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆశా వర్కర్స్ తో కలిసి 11వ యోగా డేస్ సందర్భంగా దివిజన్లోని పలుచోట్లలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ కాంక్రీట్ జంగల్ లో చెట్లను నాటి వాటిని సురక్షితముగా పెంచేటట్లు చూసే బాధ్యత ప్రతి ఒక్కరిది అని కోరారు.

# జిల్లాలో 23 వేల 715 మంది రైతుల ఖాతాలలో 249 కోట్ల రూపాయల జమ

## - జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28**



జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 23 వేల 715 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 68 వేల 519 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 249 కోట్ల 60 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 176 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్., గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

# అమ్రాబాద్ కు నీటి ఎద్దడి ఇట్టి నీటి సమస్య పరిష్కరించకపోతే అమర నిరాహార చేస్తాం.

- బిజెపి నాగర్కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు



**వెలుతురు న్యూస్ , అమ్రాబాద్:**

అమ్రాబాద్ మండల కేంద్రంలో కొన్ని రోజులుగా నీటి ఎద్దడి ఏర్పడిన ప్రజా ప్రతినిధులు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఇట్టి సమస్యపై బిజెపి నాయకులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో నీటి ఎద్దడి పై బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మాట్లాడుతూ ఎనమిది బోర్లు ఐదు ఆరు నెలలు పనిచేయక మిషన్ భగీరథ నీళ్లు వారం రోజుల నుండి రాక గతంలో వచ్చినప్పుడు రెండు మూడు బిందెలే వచ్చేవి కానీ వారం రోజుల నుండి మిషన్ భగీరథ నీళ్లు రాక 8 బోర్లు పనిచేయక ప్రజల స్థానాలకు బట్టలు ఉతకడానికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి నీళ్లు లేక నానా ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్రాబాద్ గ్రామ పంచాయితీ కార్యదర్శి మిషన్ భగీరథ సంబంధించిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి ప్రజలను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. మన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ వెంటనే స్పందించి మిషన్ భగీరథ నీళ్లు వచ్చే విధంగా చూడాలని గ్రామంలోని 8 గ్రామపంచాయతీ బోర్లు, మోటర్లు రిపేర్ చేయించకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న అధికారులపై విచారణకు ఆదేశించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ నీళ్లు ప్రతిరోజు వచ్చే విధంగా కనీసము ఇంటికి ఇరవై బిందెల నీళ్లు వచ్చే విధంగా 8 బోరు మోటార్లను రిపేర్ చేసి ప్రజలకు మంచినీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.లేని పక్షంలో అమ్రాబాద్ లో నీటి కోసం అమర నిరాహార దీక్ష చేయడానికి ప్రజలతో పాటు బిజెపి నాయకులు సిద్ధంగా ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ మాధగోని సతీష్ కుమార్ భోగరాజు శంకర్ ఎర్ర గిన్నెల వెంకటేష్ చారి ఎలిజాల అభిరామ్ ప్రజలు ఎలిజాల లక్ష్మయ్య మురుపోజు సత్యనారాయణ చారి కాసోజు విష్ణు చారి మురుపోజు పందరి మురుపోజు కృష్ణయ్య చారి కాసోజు చక్రపాణి జల్ల శివ గౌడ్ మొగిలి గణేష్ చరణ్ వినయ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వల్లంపహాడ్ బ్రిడ్జి వద్ద గుంతలు పడ్డ రోడ్డు కు మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి ఈఈ కి కోలగని శ్రీనివాస్ వినతి



**కరీంనగర్ వెలుతురు మే 28:**

కరీంనగర్ నుండి చొప్పదండి రోడ్లో వల్లం పహాడ్ బ్రిడ్జి వద్ద ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందని, రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రోజున మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆర్ అండ్ బి ఈ ఈ కి వినతి పత్రం సమర్పించారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే ఈ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో కొలగని శ్రీనివాస్ పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా రహదారి మారిందని, గుంతల పరిస్థితి తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడి ప్రాంతంలో ప్రాణ నష్టం జరగడంతో పాటు, పలువురు గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. వల్లంపహాడ్ బ్రిడ్జి వద్ద ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకొని, ఆర్ అండ్ బి రోడ్ లో ఏర్పడ్డ గుంతలను తారుతో పూడ్చడానికి తక్షణం చర్యలు చేపట్టాలని కో లగని శ్రీనివాస్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీని గట్టెక్కించడం అందరి బాధ్యత

- కార్మికులను కాపాడుకోవడమూ ముఖ్యమే

**హైదరాబాద్,మే28( వెలుతురు):**



నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించడం కోసం ఎండి సజ్జన్నార్ రకరకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే కరిమింగిన వెలగపండులా ఆర్టీసీ రోజురోజుకూ కుదేలవుతోంది. ప్రస్తుత నష్టాలను చార్జీల ద్వారా గట్టెక్కించడం అసాధ్యం. దీనికితోడు పెరుగుతున్న డీజిల్ ధరలు కూడా ఆర్టీసికి గుదిబండగా మారాయి. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ మరింత నష్టాల్లోకి దిగజారింది. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో వెనకాడరాదు. అదేపనిగా టిక్కెట్ ధరలు పెంచినా గట్టెక్కించడం అసాధ్యం. ఆర్టీసిని లాభాల్లోకి తీసుకుని రావడంతో పాటు, కార్మికులకు కాపాడుకునే బాద్యత యాజమాన్యంపై ఉంది. అయితే ఎండిగా సజ్జన్నార్ బాధ్యతలు తీసుకున్న తరవాత గతంకన్నా మేలనే చెప్పాలి. అనేక విధాలుగా ఆర్టీసీని గట్టెక్కించే చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా చిన్న అవకాశం వదలకుండా కృషి చేస్తున్నారు. ఆర్టీసీని రక్షించుకునే ప్రయత్నంలో కార్మికుల జీవితాలకు కూడా భరోసా కల్పించి ముందుకు సాగాల్సి ఉంది. ప్రజలకు ఉత్తమ, మెరుగైన రవాణా సౌకర్యాలు, బస్సుల్లో అధికరద్దీని తగ్గించడం, అనుకూలమైన, అందుబాటు టికెట్ ధరలు, ఎక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో సాగుతున్నది. ఆర్టీసీ రక్షణతో పాటు,కార్మికులు పక్షాన కూడా ఆలోచనతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించాల్సి ఉంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి. వాటిని పాక్షికంగా లేదా పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నిస్తున్నాయి. అనేక సంక్షేమ పథకాల అమలు వల్ల ఎప్పటికప్పుడు నిండుకుంటున్న ఖజానాతోపాటు, ఆర్థిక మాంద్యం దెబ్బతో బడ్జెట్ లెక్కలను నేల మీదకు దించక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదనేది ఆర్థిక రంగ నిపుణుల అభిప్రాయం. మారిన పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టుకు పూర్తిగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్న వారు మినహా మిగిలిన జనం పెద్దగా ఇబ్బంది పడటంలేదు. ఆర్టీసీని కూడా ఏదో రకంగా గట్టెక్కించి లాభాల్లోకిరాకున్నానస్టాలు రాకుండా చూడగలగాలి. ఇది ఏ ఒక్కరిద్దరి సమస్యనో కాదు. 50వేల మంది కార్మికులు, వారి కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశం. నిబద్ధతతో పని చేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, 21 శాతం ఫిట్‌మెంట్ తో 2017 పీఆర్సీ, 2013 ఆర్పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతో పాటు- పెండింగ్ డీఏలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో మరణించిన 2,350 మంది సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామన్నారు. మెడికల్ అన్ ఫిట్ అయిన మరో 537 మందికి ఉద్యోగాలు ఇచ్చామని వీసీ సజ్జనార్ వెల్లడించారు.ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఉద్యోగికి వైద్య పరీక్షలు చేశామని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ ఆరోగ్య టెస్టుల ఫలితంగా 726 మంది ఉద్యోగులకు, 184 మంది ఉద్యోగుల జీవిత భాగస్వాములను ప్రాణాప్రాయం నుంచి సంస్థ కాపాడిందన్నారు. అలాగే, మహాలక్ష్మి పథకం అమలుతో సిబ్బందిలో పెరిగిన పని భారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతుంటే.. కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీలో 3036 రెగ్యూలర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చిందని.. సాంకేతిక కారణాల వల్ల నియామక పక్రియలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ నియమాకాలు కచ్చితంగా జరుగుతాయి.. అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. తమ మనుగడ కోసం ఐదారు నెలలుగా కొందరు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నా.. ఉద్యోగులు ఎంతో సమయమనంతో ఉన్నారని వీసీ సజ్జనార్ చెప్పారు. అలాగే, ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేలా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వీసీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగులు, సంస్థ ప్రయోజనాలే ఉంటాయో తప్ప.. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవన్నారు. ప్రతి నిర్ణయం చాలా పారదర్శకంగా, సంస్థ నియమ నిబంధనలకు లోబడే ఉంటుందని ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

# అస్తవ్యస్తంగా ముంబై డ్రైనేజీ వ్యవస్థ

- భారీ వర్షం పడితే సముద్రం తలపించేలా వీధులు
- పాలకులు చిత్తశుద్ధి లోపంతో ప్రజలకు అవస్థలు

**ముంబై,మే28( వెలుతురు):**




ముంబై మహానగరంలో ఏటా వర్షాలు వస్తే నరకం చూడాల్సిందే. చిన్నపాటి వర్షం అయినా చిగురుటాకులా వణికిపోతుంది. అలాంటిది సాధారణం కన్నా రెండు వారాల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు 107 ఏళ్ల నాటి రికార్డులను చెరిపివేస్తూ కురిపించిన కుండపోతతో దేశ ఆర్థిక రాజధాని అతలాకుతలమైంది. ఎంతటి మహానగరమైనా వరుణుడు కన్నెర్ర చేస్తే నడిసంద్రంలా మారుతున్న తీరు మన పాలకుల ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలిచిపోతోంది. గతంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ... ఇలా ఎన్నో ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. 2021లో ఇదే ముంబై నగరం భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయింది. ఆకస్మికంగా భారీ వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై నిపుణుల కమిటీలు పలు సిఫార్సులు చేశాయి. కానీ, పాలకులు వాటిని అమలు చేయకుండా బుట్టదాఖలు చేయడం వల్లనే ఇటువంటి నష్టాలు తిరిగి సంభవిస్తున్న పరిస్థితి. ప్రధానంగా ఆక్రమణలు, డ్రైనేజీ వ్యవస్థ అల్లకల్లోలం చేస్తున్నాయి. ఆర్థిక నగరానికి ఆదాయం ఉన్నా దానిని బాగు చేసే ఆలోచనలో పాలకులు లేరు. ఎవరు అధికారంలో ఉన్న ముంబై అతలాకుతలం కావాల్సిందే. మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపకపోవడం నగరాలు, పట్టణాలు నీట మునకకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజిలు తదితర మౌలిక వసతులు కల్పించి, నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటి-కై-నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భుజంభుజం కలపాలి. ప్రకృతికి అనుకూలంగా ఉండే ప్రాజెక్టులను రూపొందించడం, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం, నూతన నగరాల నిర్మాణంలో, ఉన్న నగరాల విస్తరణలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లాంటి చర్యలు అత్యావశ్యకం.ఈ ఏడాది 16 రోజులు ముందుగానే రావడం గత 75 ఏళ్లలో ఇదే తొలిసారి. మునిగిన రహదారులు, భూగర్భ మెట్రో లైన్లు, రైల్వే స్టేషన్లతో నగర జీవనం స్తంభించిపోయింది. రోడ్డు, రైలు, విమాన సర్వీసులకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్లో అలర్ట్‌ను జారీచేయడం ద్వారా ఈ స్థాయి వర్షాలను అంచనా వేయడంలో భారత వాతావరణ శాఖ విఫలమైనట్టే! గతంలో వయనాడ్‌లో భారీ వర్షాలతో కొండచరియల బీభత్స సమయంలోనూ వాతావరణ శాఖ వైఫల్యం మనమెరిగిందే! ఇంతటి భారీ వర్షపాతానికి సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ మార్పులు ప్రధాన కారణమని ఐఎండి చెబుతోంది. ధారాపాతంగా రాత్రంతా కురిసిన 200 మిల్లీమీటర్లకు మించిన వర్షపాతం ముంబైని ముంచెత్తింది. పొరుగున ఉన్న కొలాబాలో సోమవారం 295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం 1918 నాటి రికార్డు 279.4 మిల్లీమీటర్లను తిరగరాసింది. దక్షిణ ముంబైలో 13 గంటల్లోనే 252 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు ప్రభావం చూపాయి. కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన పది రోజులకు మహారాష్ట్రకు రావాల్సి ఉండగా 24 గంటల్లోనే ఇక్కడ ప్రతాపం చూపాయి. సాధారణంగా ఏటా జూన్ 11న ముంబైలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. వాతావరణ శాఖ మరింత అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా నష్టాల తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం అమలుకు అమెరికాలాంటి అగ్రరాజ్యాలు చేతులెత్తేయడం, పర్యావరణ పరిరక్షణకు చేసిన తీర్మానాల అమలుకు శ్రద్ధ చూపని ధనిక దేశాల తీరు ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను భారీగా పెంచేస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాలకు పెనుముప్పుగా మారిపోతున్నాయి. ఏటా అంతక్రితం ఏడాదితో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతూనే ఉన్నాయని కేందప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఐదేళ్ల క్రితమే అంచనా వేసింది. కుండపోత వర్షాలు కురిసినా చెరువులు, వాగులు, వంకలు లాంటి సహజ సిద్ధమైన ప్రవాహ మార్గం ద్వారా గతంలో వెళ్లిపోయేవి. నగరాలు, పట్టణాల విస్తరణ, అక్రమార్కుల కబ్జాలు, వాటికి పాలకుల ప్రోత్సాహం... ఇవన్నీ నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ అడ్డంకులుగా వున్నాయి. గత ఏడాది విజయవాడను ముంచెత్తిన వరదలు కూడా ఇలాంటివే. ప్రకృతి వైపరీత్యాల నష్టాల తీవ్రతకు పాలకుల విధాన వైఫల్యమే ప్రధాన కారణం.

**( ఆధ్యాత్మిక చింతన)**

# కలియుగంలో భగవన్నామస్మరణమే

**తిరుమల,మే28( వెలుతురు):**



కలియుగంలో భక్తి పారాయణం అన్నది భగవంతుడి కృప పొందడానికి ఉన్న ఏకైక మార్గం. తపస్సులు ఆచరించి భగవంతుడిని సాధించడానికి ఈ కలికాలంలో అసాధ్యం. నామస్మరణ ద్వారా అనుభూతి కలుగుతుంది. అది అనుభవించిన వారికే దాని మాధుర్యం తెలుస్తుంది. భగవన్నామ స్మరణ ఒక్కటే వారికి మోక్షదాయకమని వేదపురాణాలు చెబుతున్నాయి. సప్త వ్యసన పరులైనా చనిపోయేముందు రామనామ జపం చేస్తారు. నారాయణుడి పేరును తులస్తారు. నారాయణ నామం పదేపదే ఉచ్ఛరించడం వల్ల నేరుగా వైకుంఠానికి చేరుకుంటామన్న భావన కారణంగా ఇలా చేస్తారు.అందుకే భగవంతుడు స్మరణతోనే సాక్షాత్కరించే యుగం ఇది. కలియుగంలో కేవలం మనస్సును లగ్నం చేసి స్మరించాలి. భగవంతుణ్ని చేరడానికి నామస్మరణే సులభమైన భక్తి మార్గమని మన పూర్వీకులు, మునులు సూచించారు. శ్వాస, ధ్యాసలను ఆ పరమాత్ముని నామ జపం మీదే ఉంచి ఆయన్ని చేరడానికి ప్రయత్నించాలి. భజనలు, పారాయణాలు, పూజలు మాత్రమే చేయాల్సి ఉంటుంది. ప్రముఖ వాగ్గేయకారులంతా భగవంతుడి నామస్మరణలో తమదైన స్తోత్రాలు చేశారు. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు లాంటి వారంతా భగవంతుడిని ప్రేమతో ఆరాధించారు.నామస్మరణలు, భజనలు, ఆరాధనలు కేవలం భక్తిని మాత్రమే కాకుండా మనిషిలో ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం కలిగిస్తాయి. అనిర్వచనీయమైనా ఆత్మానందాన్ని ఇస్తాయి. మానసిక ఉల్లాసానికి కారణ మవుతాయి. ఆశావహదృక్పథం, ప్రేమతత్వం పెరుగుతంది. ఈ జీవితంలో భగవన్నామ స్మరణ ఒక్కటే ముక్తికి దగ్గరి దారి అని మహర్షులెందరో చాటిచెప్పారు. భగవంతుని అనుగ్రహం పొందడానికి, ఆయన ప్రేమను పొందడానికి ప్రేరణ భక్తి ఒక్కటే. భగవానుని ఆశీస్సులతో నిత్యజీవితంలో ఎదురయ్యే కష్టనష్టాల నుంచి ఉపశమనం పొందడానికి కూడా ప్రేరణ ఇస్తాయి. ఉన్నంతలో సంతృప్తిగా, సంతోషంగా, జీవన విధానాన్ని తీర్చిదిద్దుకునేందుకు ఆధ్యాత్మికత అన్నది దోహపడుతుంది. అంతెందుకు మనమంతా సన్మార్గంలో పయనించాలన్న బలమైన భావన, విశ్వాసం ఏర్పడుతాయి. వేదాంతపరమైన అంశాలను, గురువుల బోధనను, మత గ్రంథాలలో ప్రస్తావించిన విషయాలను కొంత వరకైనా అవగాహన చేసుకొని ఆచరణ చేయడం మంచింది. అయితే ఆచరణలో పెట్టకుండా ఎన్ని ప్రబోధాలు విన్నా, ఎన్ని గ్రంథాలు పారాయణం చేసినా ప్రయోజనం ఉండదు. మన రామాయణ, భారత, భాగవతాది గ్రంథాల్లో వచ్చే కథలన్నీ ఇలాంటి స్ఫూర్తిని రగిలిస్తాయి. పురాణాలు, ప్రబంధాలు ప్రబోధిం చిన ధర్మాలను, జీవన విధానాలను ఆచరణలో పెట్టుకుని,భక్తిభావనలో ముందుకు సాగితే జీవితం సుఖమయం కాగలదు.

## గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్ఐ కి వినతి పత్రం ఇచ్చిన బిజెపి మనోహరాబాద్ మండల కమిటీ



**మనోహరాబాద్ వెలుతురు మే 28:**
గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని మనోహరాబాద్ మండల్ ఎస్ఐ గారికి గోమాతలని కాపాడాలని, చెక్ పోస్ట్ లు కట్టుదిట్టాం చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, జిల్లా నాయకులు పాగాలా అజయ్, కొల్తూరి నరేష్ గౌడ్,మనోహరాబాద్ టౌన్ ప్రెసిడెంట్ శ్రీశైలం యాదవ్,కాళ్ళకల్ గ్రామ అధ్యక్షులు కొత్తూరి మల్లేష్ ముదిరాజ్, ఎర్ర కృష్ణ, సాయి కిరణ్ గౌడ్,సందా ప్రవీణ్ యాదవ్,ప్రణయ్, చల్ల నరేందర్,రచ్చ శ్రీకాంత్,పంది నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కు మంత్రి పదవి ఇవ్వాలి

- **నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సంభు వెంకటరమణ**



**వెలుతురు న్యూస్ , అమ్రాబాద్:**
రేపు జరగబోయే మంత్రివర్గ విస్తరణలో వెనకబడిన నల్లమల అడవి ఆదిమ జాతి అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలంటే అచ్చంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కు మంత్రివర్గ విస్తరణ లో స్థానం కల్పించాలని నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సంబు వెంకటరమణ ఉమామహేశ్వర దేవస్థానం పాలక మండలి సభ్యురాలు సంబు శోభ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ రహీం, జూలూరు సత్యనారాయణ పంబలి బుచ్చయ్య కొండపల్లి వెంకటయ్య కోరారు. కాంగ్రెస్ పార్టీకి అచ్చొచ్చిన అచ్చంపేట నియోజకవర్గం మంత్రి పదవి ఇస్తే పదిహేను సంవత్సరాలు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికార%శీ% ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.గతంలో కూడా స్వర్గీయ మహేంద్ర నాథ్ ఈ నియోజకవర్గం నుండి రెవెన్యూ శాఖ, ఆర్థిక శాఖ మంత్రిగా సేవలు అందించారని ఈసారి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను యాభై వేల ఓట్ల భారీ మెజార్టీ తో గెలిపించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కు మంత్రి పదవిలో స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పుణ్యశ్లోక లోకమాత అహల్యాబాయి శతజయంతి



**వెలుతురు న్యూస్, అచ్చంపేట:**
పుణ్య శ్లోక లోకమాత అహల్య బాయి శత జయంతి సందర్భంగా మే 31న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నాగర్ కర్నూల్ భారతీయ జనతాపార్టి జిల్లా కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించబడుతుందని నాగర్ కర్నూల్ జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బల్మూరు జానకి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుండి పెద్దసంఖ్యలో ప్రజలు మహిళలు బిజెపి శ్రేణులందరు. సమయానికి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## రాణి అహిల్యా బాయి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి





**ఆదిలాబాద్ వెలుతురు మే 28:**
సనాతన హిందూ ధర్మంలో మహిళలను నారీ శక్తిగా పూజించారని మఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. అటువంటి చరిత్రను ప్రస్తుత తరం తెలుసుకోవడంతో పాటు భావి తరాలకు తెలియజేయాలన్నారు రాణి అహిల్యా బాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆమె జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాలను బీజేపీ నాయకురాలు జ్యోతి రెడ్డి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ లో పంపిణీ చేశారు. రాణి అహిల్యా బాయి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు కార్యక్రమంలో నాయకులు అనిత ప్రపోల్వజే. తదితరులు పాల్గొన్నారు



సత్తుపల్లి నియోజకవర్గం బీజేపీ పార్టీ ఆఫీస్ నందు వీర సావర్కర్ జన్మదిన వేడుకల లొ స్థానిక బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ వీ రమేష్

**సత్తుపల్లి వెలుతురు మే 28:**

# టీపీసీసీలో సామాజిక న్యాయం సాధ్యమా..





**హైదరాబాద్, మే 28, ( వెలుతురు)**
తెలంగాణలో కుల గణన ఇటీవలే జరిగింది. ఇది దేశమంతటా అమలు చేయాలని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రతీ వేదికపైన "జిత్నీ ఆబాదీ, ఉత్నా హక్" (ఎంత జనాభా ఉంటే అంత హక్కు) కల్పించాలని ఆ పార్టీ అగ్రనేత , లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ ప్రవచిస్తున్న విషయం తెలిసిందే. అయితే తెలంగాణ సర్కార్ తమ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా కుల గణన విషయంలో రాకెట్ వేగంతో పని చేసింది. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపంది. తెలంగాణ మోడల్ అనుసరించి దేశ వ్యాప్తంగా జన గణన సమయంలోనే కుల గణన జరపాలని డిమాండ్ చేసింది. ముందు ససేమిరా అన్న ఎన్డీఏ ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణన చేస్తామని చెప్పి ఓ కొత్త రాజకీయ వ్యూహాన్ని ముందుకు తెచ్చింది. అయితే ఇప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మరో సాహసోపేతమైన నిర్ణయానికి సిద్ధమవుతుందా లేదా అన్న చర్చ సాగుతోంది. టీపీసీసీ కమిటీల నియామకంలో కుల గణనకు అనుగుణంగా కమిటీల కూర్పు ఉంటుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీలో ఉన్నారు. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్ చార్జ్ కేసీ వేణుగోపాల్ తో పీసీసీ కమిటీల కూర్పు, మంత్రి వర్గ విస్తరణపై చర్చలు జరుపుతున్నారు. అయితే ఇప్పుడు ఆ కమిటీలు రాహుల్ గాంధీ డిమాండ్ చేసినట్లు జనభా ప్రాతిపదికన ఉంటుందా , రాష్ట్రంలో కుల గణనకు అనుగుణంగా సామాజిక వర్గాల నేతలకు న్యాయం చేస్తారా లేదా అన్నదే ఇప్పుడు ముందున్న ప్రశ్నతెలంగాణ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు అనేది అప్పటి పరిస్థితులను బట్టి, ఆశావాహులను బట్టి, పార్టీలో అసంతృప్త నేతలను సంతృప్తి పరచాల్సి ఉంటుంది , ఈ కారణాలను బట్టి టీపీసీసీ స్వరూపం తరచూ మారుతూ ఉంటుంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు - ఇది తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించే అత్యంత కీలకమైన పదవి. ప్రస్తుతం బీసీ నాయకుడు అయిన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఈ పదవిలో కొనసాగుతున్నారు. వర్కింగ్ ప్రసిడెండ్ లేదా కార్యనిర్వాహక అధ్యక్షులు - పార్టీ అధ్యక్షుడికి పార్టీ కార్యక్రమాల్లో సహాయకారిగా ఉండేందుకు ఈ పదవిని ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం నలుగురు వర్కింగ్ ప్రసిడెంట్లను నియమిస్తున్నారు. ఇందులో పార్టీ సీనియారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ కోటాలను పరిగణలోకి తీసుకుని వర్కింగ్ ప్రసిడెంట్లను పార్టీ నియమిస్తుంది. వైస్ ప్రసిడెంట్స్ లేదా ఉపాధ్యక్షులు - టీపీసీసీలో వర్కింగ్ ప్రసిడంట్స్ తర్వాత కీలక పదవి ఇది. వీరు పార్టీ కార్యకలాపాల్లో కీలక పాత్ర వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు. అటు పీసీసీ చీఫ్ తో పాటు వర్కింగ్ ప్రసిడెంట్లతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను నిర్వర్తిస్తారు. దాదాపు 10 నుండి 20 మంది వరకు పార్టీ ఉపాధ్యక్షులుగా ఉండే అవకాశం ఉంది. సందర్భానుసారంగా ఈ సంఖ్య మారే అవకాశం ఉంది.పార్టీ జనరల్ సెక్రటరీస్ లేదా ప్రధాన కార్యదర్శులు - పార్టీలో మరో కీలకమైన పదవి ప్రధాన కార్యదర్శి పదవి. వీరు పార్టీలోని అంతర్గత, సంస్థాగత వ్యవహాలను చూస్తారు. ప్రతీ జిల్లా నుంచి ఇద్దరు ప్రధాన కార్యదర్శుల ఉండే అవకాశం ఉంది. ఆ జిల్లాను సమన్వయం చేయడానికి . ఇక హైదరాబాద్, రంగా రెడ్డి నుండి ఎక్కు మంది ప్రధాన కార్యదర్శులు ఉండే అవకాశం ఉంది. దాదాపు 80 మంది ప్రధాన కార్యదర్శులుగా ఉండే అవకాశం ఉంది. పార్టీ సెక్రటరీస్ లేదా కార్యదర్శులు - పార్టీ ఇచ్చే కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో వీరు కీలకంగా పని చేస్తారు. క్షేత్ర స్థాయిలో అటు ప్రజలు, ఇటు పార్టీ కార్యకర్తలతో కలిసి పని చేస్తారు. పార్టీ తీసుకునే నిర్ణయాలను వీరు అమలు చేస్తారు. దాదాపు 40 మందిని ఈ పదవుల్లో నియమించే అవకాశం ఉందిపార్టీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్స్ లేదా పార్టీ అధికార ప్రతినిధులు - వీరు పార్టీ తీసుకున్న నిర్ణయాలను, పార్టీ కార్యక్రమాలను, ఆయా అంశాలపై పార్టీ తీసుకునే స్టాండ్ ను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తారు. వీరు దాదాపు ఐదు నుండి పది మంది ఉండే అవకాశం ఉందిపార్టీ క్యాంపెయిన్ కమిటీ లేదా ప్రచార కమిటీ - ఈ కమిటీ పార్టీ కి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను రూపొందించడం, వాటిని అమలు చేయడం ప్రధాన విధి. ఇది ఎన్నికల అవసరాలను బట్టి ప్రచార కమిటీ సభ్యుల సంఖ్య మారుతూ ఉంటుంది.డిసిప్లినరీ యాక్షన్ కమిటీ లేదా క్రమ శిక్షణ కమిటీ - ఇది పార్టీ సభ్యులు, పార్టీ నియమాలకు అనుగుణంగా ఉండేలా చూస్తుంది. ఎవరైనా పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే ఆ సభ్యులను విచారిస్తుంది. తప్పని తెలితే తీసుకోవాల్సిన క్రమ శిక్షణ చర్యలను పార్టీ అధ్యక్షునికి సిఫారసు చేస్తుంది. ఇందులో పార్టీలోని సీనియర్లను నియమిస్తారు. దాదాపు 7గురి వరకు అవకాశం కల్పించ వచ్చు.ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ రూపొందించిన దేశ వ్యాప్త కార్యక్రమాలు లేదా ప్రచార కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేసేలా చూస్తుంది. ఏఐసీసీ చేసే సూచనలను, ఆదేశాలను పార్టీలోను, రాష్ట్రంలో పార్టీ తరఫున అమలు చేసే కమిటీ. ఏఐసీసీకి, రాష్ట్ర పార్టీకి మధ్య అనుసంధాన కర్తగా ఈ కమిటీ పని చేస్తుంది.రాజకీయ వ్యవహారాల కమిటీ (పొలిటికల్ అఫైర్స్ కమిటీ ) - ఈ కమిటీలో పార్టీ సీనియర్ నేతలు సభ్యులుగా ఉంటారు. వీరు పార్టీకి సంబంధించి రాష్ట్రంలో తీసుకోవాల్సిన రాజకీయ నిర్ణయాలను ఈ కమిటీ తీసుకుంటుంది. అవసరమైన సలహాలు సూచనలను పార్టీకి అందిస్తుంది. ఈ కమిటీలతో పాటు చేరికల కమిటీ, ఎన్నికల సమయంలో పార్టీ మ్యానిఫెస్టో తయారు చేసే కమిటీల వంటివి ఉంటాయి. ఇక క్షేత్ర స్థాయిలో జిల్లా కమిటీలు, బ్లాక్, మండల, గ్రామ కమిటీలు ఉంటాయి. కార్మిక, రైతు, విద్యార్థి , యువత, మహిళ, మైనార్టీ వంటి అనుబంధ కమిటీలు ఉంటాయి. ఈ కమిటీల కూర్పు పార్టీ సీనియారిటీ, వారి పని తీరు, కుల సమీకరణలను బట్టి జరుగుతుంది.

## గులాబీలో కవిత కలకలం

**హైదరాబాద్, మే 28, ( వెలుతురు)**
ఒకే ఒక్క లెటర్..ఆ తర్వాత..మీడియా ముందు స్టేట్‌మెంట్స్. కవిత ఎపిసోడ్ అటు బీఆర్ఎస్‌లో ఇటు తెలంగాణ రాజకీయాల్లో టాక్ ఆఫ్‌ది పాలిటిక్స్‌గా మారింది. ఇదే టైమ్‌లో కవిత..బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్నారని..కేటీఆర్, హరీశ్, సంతోష్‌తో ఆమెకు గ్యాప్ ఉందన్న టాక్ బలంగా వినిపించింది. అంతేకాదు ఆమె కారు దిగి సొంత కుంపటి పెట్టుకుంటారన్న ఊహాగానాలు వినిపించాయి. ఇప్పటికీ ఆ వార్తలు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. కానీ ఇంతలోనే కవిత చిన్న ట్విస్ట్ చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈకార్ రేసులో ఏసీబీ నోటీసులు ఇవ్వడంపై ట్వీట్ చేసి మరోసారి చర్చకు దారి తీశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే రేవంత్ సర్కార్ కుట్రపూరితంగా కేటీఆర్‌కు నోటీసులిచ్చిందన్నారు. కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు కవిత. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులదంటూ ఫైనల్ టచ్ ఇచ్చారామె.కవిత బీఆర్ఎస్‌ను వీడుతారని ప్రచార జరుగుతున్న నేపథ్యంలో..ఆమె కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని ఖండించడం హాట్ టాపిక్ అవుతుంది. ఇంతకీ బీఆర్ఎస్‌లో ఏం జరుగుతుందన్న దానిపై ఆసక్తిరేపుతోంది. అయితే కవిత లెటర్ ఇష్యూపై కేసీఆర్, కేటీఆర్ ఫాంహౌస్‌లో రెండున్నగంటల పాటు చర్చించినట్లు వార్తలు వచ్చాయి. కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లాల్సిన కవిత అర్ధాంతరంగా ఆగిపోయారు. కేటీఆర్, కేసీఆర్ మీటింగ్ తర్వాత ఆమె తన కాళేశ్వరం పర్యటనను క్యాన్సల్ చేసుకోవడం చర్చనీయాంశం అయింది. అయితే కేసీఆర్ సూచనతోనే ఆమె తన టూర్ రద్దు చేసుకున్నారా లేక మీడియా ముందుకు మరోసారి రావడం ఇష్టం లేక ఆమెనే ఆగిపోయారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది.మరోవైపు బీఆర్ఎస్ ఎంపీ దామోదర్‌రావు, న్యాయవాది గండ్ర మోహన్ రావు కవితతో భేటీ అయ్యారు. రెండు గంటలకు పైగా ఆమెతో చర్చించారు. అయితే వారిద్దరూ కవితతో ఉన్న సాన్నిహిత్యంతోనే ఆమెను కలిశారు తప్ప..కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం ఈ భేటీలో ఏమీ లేదని తెలుస్తోంది. అయితే కవితతో జరిపిన చర్చల సారాంశాన్ని, ఆమె మనోగతాన్ని మాత్రం ఆ తర్వాత గులాబీబాస్‌కు వారు చేరవేశారని అంటున్నారు. అయితే కేసీఆర్ మాత్రం కవిత అంశంపై ఏ మాత్రం తగ్గడం లేదని..ముఖ్యంగా లేఖ ఎలా లీక్ అయిందన్నది గుర్తించే పనిలో ఉన్నారని చర్చ జరుగుతోంది.అయితే తాను పార్టీలో ఎదుర్కొన్న ఇబ్బందులు, అవమానాలను కవిత దూతల ముందు ఏకరువు పెట్టినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే కొందరి వైఖరి వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారట. అంతే కాకుండా తన తండ్రి కేసీఆర్‌ను కలిసి మిగతా విషయాలు మాట్లాడతానని కవిత చెప్పినట్లు సమాచారం.కేసీఆర్ సమయం ఇస్తే పార్టీలో తన పాత్ర, పదవి, తన వర్గానికి పార్టీ పదవులు వంటి డిమాండ్స్‌ను కేసీఆర్ ముందు ఉంచాలన్న ఆలోచనలో కవిత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కేసీఆర్ మాత్రం ఇప్పట్లో కవితను కలిసేదే లేదని, ఆమెతో మాట్లాడేదే లేదని తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. ఓ వైపు ఇదంతా జరుగుతుండగానే..సింగరేణిలో కవిత తన సంఘాన్ని ఏర్పాటు చేయడం చర్చకు దారితీస్తోంది. సింగరేణి జాగృతి అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తూ ఎమ్మెల్సీ కవిత నిర్ణయం తీసుకున్నారు.పైగా కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తామని ఆమె ప్రకటించడం కొసమెరుపు. మరోవైపు కవిత అనుచరులు మాత్రం..తెలంగాణ ఆవిర్భావం అయిన జూన్ 2నే అక్క పార్టీ పెట్టడం ఖాయమని..పార్టీ పేరు %ుదీ=ా%అని%ొ% పూర్తి పేరు తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి అని ప్రచారం చేస్తుండటం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో కవిత ఎపిసోడ్ ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి మరి.



# జూన్ 5న ఏం జరగబోతోంది.,.

**హైదరాబాద్, మే 28, ( వెలుతురు)**
కాళేశ్వరం కమిషన్ ఎదుటకు విచారణకు హాజరు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. జూన్ నెల 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరు కావాలని కమిషన్ ఇచ్చిన నోటీసులు జారీచేసింది. అయితే ఈ విచారణకు కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్న దానికిసంబంధించి కేసీఆర్ క్లారిటీ ఇచ్చారు. పార్టీలోని సీనియర్ నేతలకు కేసీఆర్ సమాచారం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్దయెత్తున అవినీతి జరిగిందని తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను నియమించింది. ఈ కమిషన్ కేసీఆర్, ఈటల రాజేందర్, హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసింది. జూన్ ఆరో తేదీన ఈటల రాజేందర్, 9వ తేదీన హరీశ్ రావు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. అయితే కేసీఆర్ హాజరవుతుండటంతో హరీశ్ రావు కూడా హాజరు కానున్నారు. కమిషన్ ఎదుట హాజరయి ప్రశ్నలకు నేరుగా కేసీఆర్ సమాధానం చెప్పాలని నిర్ణయించినట్లు తెలిసిందికాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది తెలంగాణ ప్రభుత్వం. జస్టిస్ PC ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా పూర్తయ్యే దశకు చేరుకుంది. ఈ చివరి దశలో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. జూన్ 5న కేసీఆర్, జూన్ 6న ఈటెల రాజేందర్, చివరగా జూన్ 9న హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.నోటీసు అందుకున్న అప్పటి నుంచి పార్టీలో కాళేశ్వరం కమిషన్ ముందుకు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది. ఇప్పటికీ కెసిఆర్ ఫామ్ హౌస్ లో చాలాసార్లు దీనిపై చర్చించారు. పార్టీతో పాటు న్యాయ నిపుణులతో చర్చలు జరిపి సలహాలు తీసుకున్నారు. గతంలో విద్యుత్ కొనుగోళ్లపై వేసిన కమిషన్ పై నోటీసు అందుకున్న కేసీఆర్ చాలా తీవ్రంగా ప్రతిస్పందించారు. కమిషన్‌కు లేఖ రాస్తూ కమిషన్ ఏర్పాటు, కమిషన్ గా ఉన్న జస్టిస్ నరసింహారెడ్డి అక్కడ కొనసాగడం తప్పంటూ తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు మాత్రం ఆ పంథాలో వెళ్లకూడదని భావిస్తున్నట్లు తెలిసింది.అయితే నిజానికి పోయిన ఏడాది అసెంబ్లీలో కాళేశ్వరంపై కావాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించుకోండి అంటూ సవాల్ విసిరిందే బీఆర్ఎస్. తీరా ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తర్వాత హాజరు కాకపోతే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని, కమిషన్‌ను గౌరవించకపోతే అది బీఆర్ఎస్ పై దెబ్బ పడుతుందని భావిస్తున్నారు. హాజరైతే ప్రజల్లో సింపతీ పెరుగుతుందని, ప్రభుత్వం కావాలనే కక్ష గట్టి విచారణలకు తిప్పుతుందని సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారు. మొత్తానికి మొదటిసారిగా ఓ విచారణకు గులాబీ దళపతి హాజరవుతారని తెలుస్తోంది. మరోవైపు పార్టీలో గంభీర వాతావరణం కనిపిస్తుంది. జూన్ 5 బిగ్ డే అంటూ చర్చిస్తున్నారు కార్యకర్తలు.ఇక కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే 400 పేజీల నివేదికను సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో కీలక పోస్టులను డీల్ చేసిన అధికారులు సోమేష్‌కుమార్, స్మిత సబర్వాల్, రజత్‌కుమార్ వంటి వారిని బహిరంగ విచారణకు పిలిచింది. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు, కాళేశ్వరంగా రూపాంతరం చెందడం మొదలు, ప్రాజెక్టు డిజైన్‌లు, అనుమతులు, నిధులకు సంబంధించిన కీలక సమాచారాన్ని రికార్డు చేసింది. ముఖ్య ప్రాజెక్టు వ్యయాన్ని లక్ష కోట్లకు పెంచడంపై ఆరా తీసింది. నిర్మాణం పూర్తి కాకుండానే బకాయిల చెల్లింపుపై కూడా కూపీలాగింది.ఈ సమాచారాన్ని క్రోడికరించిన పీసీ ఘోష్ కమిషన్.. గత ప్రభుత్వ హయాంలో కీలక నిర్ణయాలు తీసుకున్న పెద్దలను ప్రశ్నించాలని నిర్ణయించింది. ఆ క్రమంలోనే నోటీసులు జారీ అయ్యాయి. ఇక, మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు హరీష్‌రావు, ఈటల విచారణకు సంబంధించి ఇప్పటికే కొశ్చనరీ సిద్ధమైందా? టెక్నికల్ అంశాలతో పాటు నిధుల వ్యవహారంపై కూడా కమిషన్ ప్రధానంగా ఫోకస్ చేసిందా?. నోటీసులపై బీఆర్ ఎస్, ముఖ్యంగా కేసీఆర్ స్ట్రాటెజీ ఎలా వుండబోతుందన్నది చర్చగా మారింది.

# అస్వస్థతకు గురైన గులాంనబీ ఆజాద్

- రియాజ్ ఆస్పత్రిలో చికిత్స



**న్యూఢిల్లీ,మే28( వెలుతురు):** విదేశీ పర్యటనలో ఉన్న కేంద్రమాజీమంత్రి గులాంనబీ ఆజాద్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన బహ్రెయిన్‌లో అస్వస్థతకు గురికాగా రియాజ్‌ని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నరు. పహల్గంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు భారత్ సిద్ధమైంది. ఈ మేరకు అన్ని పార్టీల నుంచి ఎంపిలను ఎంపిక చేసి.. విదేశీ పర్యటనకు పంపించింది. అయితే ఈ బృందం సభ్యుల్లో ఒకరైన జమ్ముకశ్మీర్ మాజీ సిఎం, డెమోక్రటిక్ ప్రోగ్రెసీవ్ ఆజాద్ పార్టీ చీఫ్, మాజీ ఎంపి గులాం నబీ ఆజాద్ కూడా ఉన్నారు. అయితే ఆయన బహ్రెయిన్ పర్యటనలో అస్వస్థతకి గురయ్యారు. ఈ విషయాన్ని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి ఎంపి బైజయంత్ పాండా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆజాద్ ప్రస్తుతం రియాజ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని పేర్కొన్నారు. ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని.. కొన్ని -టె-స్టులు చేయాల్సి ఉందని తెలిపారు. సౌదీ పర్యటనలో ఉండగా.. ఆయన అనారోగ్యానికి గురి కావడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇప్పటివరకూ ఆయన సహకారంతో బహ్రెయిన్, కువైట్‌లో పర్యటనలు విజయవంతంగా జరిగాయని.. అల్జీరియా పర్యటనలో ఆయన లేని లోటు-స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

# యువగళం పాదయాత్రపై పుస్తకం

- మహానాడు వేదికపై ఆవిష్కరించిన చంద్రబాబు



**కడప,మే28( వెలుతురు):** వైకాపా అరాచక పాలనపై గళమెత్తుతూ తాను చేపట్టిన యువగళం పాదయాత్ర విశేషాలతో రూపొందించిన 'ద వాయిస్ ఆఫ్ పీపుల్' పుస్తకావిష్కరణ మహానాడు వేదికపై జరిగింది. తొలి ప్రతిని యువనేత నారా లోకేశ్ సీఎం చంద్రబాబుకు అందజేశారు. 2023 జనవరి 27న కుప్పం శ్రీవరదరాజస్వామి పాదాలచెంత నుంచి ప్రారంభించి 226 రోజులపాటు- లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏపీ రాజకీయాలను మలుపుతిప్పింది. 2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు- 3,132 కి.మీ మేర జైత్రయాత్రలా సాగింది. పాదయాత్రలో తనకు ఎదురైన అనుభవాలు, యాత్రను అడ్డగించేందుకు నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అడ్డంకులు, ఆనాటి అరాచకపాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, కన్నీటిగాథలను ఈ పుస్తకంలో సచిత్రంగా కళ్లకు కట్టినట్లుగా చూపారు. పుస్తకాన్ని ఆసక్తిగా తిలకించిన చంద్రబాబు.. యువనేత లోకేశ్‌ను అభినందించారు. యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్ర ప్రజల్లో చైతన్యం నింపారని, ఆనాటి అనుభవాలను పుస్తకరూపంలో తేవడం బాగుందంటూ ప్రశంసించారు.

# ఏడాది లోపే ఎన్నో పనులు చేసి చూపాం

- రాజకీయ తీర్మానంలో రామ్మోమన్ నాయుడు



**కడప,మే28( వెలుతురు):** విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతి ఏడాదిలోపే సాధ్యం చేసి చూపామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలు, బడుగు బలహీనవర్గాల కోసం పుట్టిన పార్టీ తెదేపా. ఎన్టీఆర్ పార్టీని స్థాపించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. యువత, చదువుకునే వారిని ప్రోత్సహించారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' సహా ఏ మూల సిద్ధాంతాలతో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారో.. ఆ విధానాలను సీఎం చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు. ఆటంకాలు లేకుండా తెదేపా, జనసేన, భాజపా పార్టీలు కూటమి ప్రభుత్వాన్ని పటిష్ఠంగా నడుపుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే మొదలయ్యాయి. తెదేపా హయాంలో పీపీపీ విధానంలో విమానాశ్రయాల నిర్మాణం చేపడుతున్నాం. ల్యాండ్ పూలింగ్ విధానం తీసుకొచ్చింది చంద్రబాబు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ విధానానికి శ్రీకారం చుడుతున్నారు. కోటి మంది సభ్యత్వాలు కలిగిన ఏ-కై-క ప్రాంతీయ పార్టీ తెదేపా. ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. సంక్షోభాలను ఎదురొడ్డి విజయవంతంగా ముందుకు సాగింది' అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# విద్యుత్ సంస్కరణలకు చంద్రబాబు రోల్ మోడల్

- ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రశంసలు



**కడప, మే28( వెలుతురు):** వైకాపా ప్రభుత్వ విధానాలు నచ్చక ఎదిరించి పోరాడానని తెదేపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుతో పాటు- పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భుజం తట్టి ప్రోత్సహించారని.. తెదేపా కుటుంబం తనను అక్కున చేర్చుకుందని గుర్తుచేసుకున్నారు. మంత్రి నారా లోకేశ్‌కు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించి.. కార్యకర్తల ఆకాంక్షలను నెరవేర్చాలని కోటంరెడ్డి కోరారు. వైకాపా దుర్మార్గాలకు ప్రజలంతా భయపడుతున్న రోజుల్లో నిర్బంధాలు, నిషేధాజ్ఞలను లోకేశ్ లెక్కచేయకుండా కార్యకర్తల భుజం తట్టి ప్రోత్సహించారన్నారు. కడపలో నిర్వహిస్తున్న మహానాడులో విద్యుత్ సంస్కరణల తీర్మానంపై కోటంరెడ్డి మాట్లాడారు. విద్యుత్ సంస్కరణలకు చంద్రబాబు రోల్ మోడల్ అని కోటంరెడ్డి కొనియాడారు. ఈ విషయం తాను చెప్పింది కాదని.. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. ఈ అంశంలో రాజకీయ ప్రత్యర్థులు సైతం చంద్రబాబును అభినందించక తప్పదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 17 మంది ముఖ్యమంత్రులు పాలిస్తే 16 మంది హయాంలో విద్యుత్ ఉత్పాదన 5వేల మెగావాట్లు- మాత్రమే ఉందని చెప్పారు. చంద్రబాబు హయాంలో 16వేల మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని వివరించారు. దీన్ని బట్టి విద్యుత్ రంగంలో ఆయనకు ఉన్న అనుభవాన్ని చెప్పొచ్చన్నారు. వైకాపా విధానాలతో దెబ్బతిన్న రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిన పెట్టారని కోటంరెడ్డి అన్నారు. ఆయన కాకుండా వేరే వ్యక్తి సీఎంగా ఉండి ఉంటే ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి తలెత్తేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తూ రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు- పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కోసం అంతర్జాతీయ స్థాయిలో పెట్టు-బడులు తీసుకొస్తున్నారని కోటంరెడ్డి చెప్పారు.

# ఈ సారి నలుగురికి అవకాశం



**హైదరాబాద్, మే28( వెలుతురు):** తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం కూర్పుపై ఢిల్లీలో వరుస సమావేశాలు జరుగుతున్నాయి. కేబినెట్ లో ఆరు పదువులు ఖాళీ ఉండగా.. కొత్తగా నలుగురిని తీసుకోవాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం దక్కనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ సామాజిక వర్గాలకు చెందిన నేతల పేర్లనుసైతం కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ టెన్ జన్‌పథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పార్టీ వ్యవహారాల జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. తెలంగాణ కేబినెట్ లో మొత్తం ఆరు ఖాళీలు ఉండగా అందులో ప్రస్తుతం ఐదింటిని భర్తీ చేయడానికి హైకమాండ్ అంగీకరించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చినప్పటికీ విస్తరణకు ముహూర్తం మాత్రం ఇంకాఖరారు కాలేదు. శుభముహూర్తాలు ఈ నెల మొదటి వారంతో ముగియనుండటంతో ఈ రోజు విస్తరణ జరిగే అవకాశముందని కూడా కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేసీ వేణుగోపాల్, రాహుల్ గాంధీతో చర్చించిన అనంతరం విస్తరణకు రెడీ అయినట్లు సమాచారం.తెలంగాణ మంత్రివర్గ విస్తరణతోపాటు పీసీసీ నూతన కార్యవర్గం అంశాలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అంతేకాక నాలుగు మంత్రి పదవుల భర్తీకి సంబంధించి ఏడుగురి పేర్లు ప్రయారిటీలో ఉన్నాయని వివరించారని, దానిపై లిస్ట్ కూడా అందజేసినట్లు సమాచారం. అదేవిధంగా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, తక్కువ సంఖ్యతో కూడిన పీసీసీ కార్యవర్గ లిస్ట్ ను సమర్పించినట్లు తెలిసింది. వేణుగోపాల్ తరువాత టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కూడా రాహుల్ తో భేటీ అయ్యారు. కేబినెట్ కూర్పు, పీసీసీ కార్యవర్గం, కవిత లేఖ, రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై రాహుల్ ఆరా తీసినట్లు తెలిసింది.రాహుల్‌తో భేటీ తరువాత మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఇప్పటికే రెండు సార్లు మా అభిప్రాయాలను అధిష్టానానికి చెప్పామని, కేబినెట్ లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే కేబినెట్ కూర్పు ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఒకటి రెండు రోజుల్లో పీసీసీ కార్యవర్గం ప్రకటన ఉంటుందని మహేశ్ గౌడ్ వెల్లడించారు.తెలంగాణ కేబినెట్ లో కొత్తగా నలుగురికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నాలుగు మంత్రి పదవులకుగాను ఏడుగురు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు, వీరిలో నాలుగు సామాజిక వర్గాలకు చెందిన నలుగురిని కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. వాస్తవానికి మంగళవారమే కేబినెట్‌లో చోటుదక్కించుకున్న వారి పేర్లపై ప్రకటన రావాల్సి ఉన్నా ఏఐసీసీ చీఫ్ మల్లిఖర్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడినట్లు తెలిసింది.బీసీ కోటాలో వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు అనుగుణంగా మంత్రివర్గంలో ఎంపిక చేయాలని కూడా అధినాయకత్వంతో రేవంత్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఇక హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాలకు కూడా కేబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ ఎక్కువగా వినిపిస్తుంది. అయితే దీనిపై ఇంకా నిర్ణయం జరగలేదంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండగా ఇప్పటి వరకూ విస్తరణ జరగక పోవడంతో నాయకుల్లోనూ, ఆశావహుల్లోనూ అసంతృప్తి ఎక్కువగా ఉంది. మల్లికార్జున ఖర్గే తో సమావేశం జరిగిన తర్వాత ముహూర్తం విస్తరణకు ఫిక్స్ అయ్యే అవకాశాలున్నాయని తెలిసింది.ఖర్గే ఈనెల 30న ఢిల్లీకి వస్తారని తెలుస్తోంది. ఆయన రాగానే మంత్రి వర్గం విస్తరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆశావహులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

# రాజీనా... విభజనా...



**హైదరాబాద్, మే28( వెలుతురు):** భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్)కు రాసిన ఆరు పేజీల లేఖ రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ లేఖలో కవిత, బీఆర్‌ఎస్ ఇటీవల ఎల్కతుర్తిలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ సభలో కేసీఆర్ ప్రసంగం గురించి సానుకూల, ప్రతికూల అంశాలను పేర్కొన్నారు. బీజేపీని కేవలం రెండు నిమిషాలు మాత్రమే విమర్శించడం, వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ, వక్ఫ్ సవరణ చట్టం వంటి కీలక అంశాలను ప్రస్తావించకపోవడం వంటి అంశాలను విమర్శించారు. ఈ లేఖ బహిర్గతం కావడం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కవితను సున్నితంగా మందలించడంతో పార్టీ కేడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. ఇలాంటి తరుణంలో తనను విమర్శినివారితో కాంప్రమైజ్ కాని కేసీఆర్.. ఈసారి మాత్రం సంచలన నిర్ణయం తీసుకున్నారు.తన నిర్ణయాతను తప్పు పట్టేవారు, తన నిర్ణయాలను ధిక్కరించేవారు ఎంతటివారైనా కేసీఆర్ సహించరు. పొమ్మనలేక పొగబెడతారు. ఆలె నరేంద్ర, విజయశాంతి, ఈటల రాజేందర్ వంటివారు ఇందుకు ఉదాహరణ. కానీ, కవిత విషయంలో మాత్రం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారు. కుటుంబ సభ్యురాలినే సస్పెండ్ చేస్తే.. పొమ్మనలేక పొగబెడితే క్యాడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఆందోళన నెలకొంది. దీంతో తనకు ఆత్మలాంటి నేతలు రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావును రాయబారానికి కవిత వద్దకు పంపించారు. సోమవారం సాయంత్రం 6%-%7 గంటల సమయంలో కవిత ఇంటికి వెళ్లిన దామోదర్‌రావు తన వెంట న్యాయవాదిని కూడా తీసుకెళ్లారు. దామోదర్ రావు, కేసీఆర్‌తో సుదీర్ఘ అనుబంధం కలిగిన నేతగా, 'నమస్తే తెలంగాణ' పత్రిక స్థాపనలో కీలక పాత్ర పోషించారు. 2022లో కేసీఆర్ ఆశీస్సులతో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలాంటి నేపథ్యంలో, ఆయన కవితను కలవడం రాజకీయంగా ముఖ్యమైన చర్చలకు దారితీసింది. కేసీఆర్ ఈ సందర్శనకు దామోదర్ రావును పంపించారా లేక ఇది వ్యక్తిగత సందర్శనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.కవిత లేఖ వెలుగులోకి వచ్చిన తర్వాత, బీఆర్‌ఎస్‌లో అంతర్గత కలహాలు బయటపడ్డాయి.

ఈ లేఖ సమయంలో కేసీఆర్‌కు వారసుడిగా కేటీ.రామారావు (కేటీఆర్)ను ప్రకటించే సూచనలు ఉన్నాయి, ఇది కవితకు అసంతృప్తి కలిగించి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత లేఖలో కేసీఆర్ అప్రాప్యత, పార్టీ క్యాడర్‌తో సంబంధం తగ్గడం వంటి అంశాలను ప్రస్తావించడం ద్వారా, ఆమె తనకు పార్టీలో సరైన స్థానం లభించడం లేదనే సంకేతాలు ఇచ్చినట్లు కనిపిస్తోంది. కేటీఆర్ ఈ లేఖపై స్పందిస్తూ, పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా చర్చించడం కాకుండా, పార్టీ వేదికల్లోనే పరిష్కరించాలని పేర్కొన్నారుకవిత లేఖ బహిర్గతం కావడం వెనుక ఒక ఉద్దేశపూర్వక రాజకీయ కుట్ర ఉందని కొందరు భావిస్తున్నారు. ఈ లేఖను కవిత బృందం లీక్ చేసి ఉండవచ్చని, లేదా కేసీఆర్ కుటుంబంలోని కొందరు ఆమెను ఒంటరిచేయడానికి ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని ఊహాగానాలు సాగుతున్నాయి. కొన్ని సమాచారాల ప్రకారం, కవితకు షోకాజ్ నోటీసు జారీ చేయడం లేదా పార్టీ నుంచి సస్పెన్షన్‌కు దారితీసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, కవిత తన లేఖలో పేర్కొన్న అంశాలు సామాన్య కార్యకర్తల అభిప్రాయాలను ప్రతిబింబిస్తాయని, తనకు వ్యక్తిగత ఎజెండా లేదని స్పష్టం చేశారు.కవిత లేఖలో బీజేపీపై కేసీఆర్ మృదువైన వైఖరిని విమర్శించడం, బీఆర్‌ఎస్ ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం వంటి అంశాలు, పార్టీ బీజేపీతో సంబంధాలు కలిగి ఉండవచ్చనే ఊహాగానాలకు బలం చేకూర్చాయి.

కవిత, ఢిల్లీ మద్యం కేసులో తన అరెస్టును బీజేపీతో ముడిపెడుతూ, ఆ పార్టీపై గట్టిగా విమర్శించాలని కేసీఆర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఈ లేఖను ఉపయోగించుకుని బీఆర్‌ఎస్‌లో అంతర్గత విభేదాలను హైలైట్ చేస్తున్నారు.దామోదర్ రావు సందర్శన, కవిత లేఖ వివాదం బీఆర్‌ఎస్‌లో రాజీకి దారితీస్తాయా లేక పార్టీలో విభజనకు కారణమవుతాయా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. కొందరు రాజకీయ విశ్లేషకులు, కవిత కాంగ్రెస్‌తో చేతులు కలపవచ్చని లేదా కొత్త పార్టీని స్థాపించవచ్చని ఊహిస్తున్నారు. అయితే, కవిత తన విధేయత కేసీఆర్‌కు ఉందని, పార్టీలో చిన్నపాటి లోపాలను సరిదిద్దితే బీఆర్‌ఎస్ దీర్ఘకాలం అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు.

# అందాల భామల వెనుక కథలు



**హైదరాబాద్, మే28( వెలుతురు):** నిజంగా కొన్ని చెప్పుకోవాలి. కొన్నింటి గురించి ప్రధానంగా చర్చించాలి.. అలాంటిదే ఇది కూడా. మన సమాజం అందాల పోటీలు అంటే 36 - 24 - 36 కొలతలే అనుకుంటుంది. ర్యాంపు వాకులు.. రాత్రిపూట పార్టీలు.. ఆ తర్వాత జరిగే అసాంఘిక కార్యకలాపాలే అని భావించుకుంటుంది.ముమ్మాటికి ఆ భావన తప్పు. అనుకునే విధానం మరింత తప్పు. ఒక సమస్యను బలంగా చాటి చెప్పాలి అంటే.. సమాజం దృష్టికి తీసుకురావాలి అంటే కచ్చితంగా ఒక బలమైన వేదిక అవసరం. అలాంటి వేదిక మిస్ వరల్డ్ పోటీలు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం మిస్ వరల్డ్ పోటీలకు వేదికగా మారింది. కొద్దిరోజుల నుంచి ప్రచారం కూడా భారీగానే చేస్తోంది. అయితే ఇందులో ఏర్పాట్లలో సరైన సమన్వయం లేకపోవడంతో ఇటీవల ఇంగ్లాండ్ కంటెస్టెంట్ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. వాటిని కాస్త పక్కన పెడితే.. అందాల పోటీలలో పాల్గొనే సుందరీ మణులు పడుతున్న ఇబ్బందులు.. వారు ఇక్కడదాకా రావడానికి కల్పించిన చాలా భిన్నమైనవి.. వారు తమ ఎదుర్కొన్న కష్టాలు.. పడిన బాధలు చెబుతుంటే హృదయం ద్రవించిపోతుంది.అందాల పోటీలకు వచ్చిన ఓ వనిత చెప్పిన తన కథ నిజంగా బాధేసింది. ఆటవిక ఆచారాల నుంచి తనను తాను కాపాడుకుంది. ఉన్నంత ధైర్యంతో.. మూడాచారాలపై ఎడతెగని పోరాటం చేస్తోంది. దీనిపై ఆమెకు అనేక బెదిరింపులు ఎదురయ్యాయి. చంపేస్తామనే హెచ్చరికలు కూడా వచ్చాయి. అయినప్పటికీ ఆమె వాటిని ధైర్యంగా ఎదుర్కొంది. తన సమస్యను ప్రపంచం ముందు గట్టిగా చెప్పాలని నిర్ణయించుకుంది. అందువల్లే అందాల పోటీలను ఒక వేదికలాగా భావించింది. ఆ వేదిక మీద దాని ఎదుర్కొంటున్న సమస్యను బలంగా చెప్పగలిగింది. అందువల్లే ఆమె ఇక్కడదాకా రాగలిగింది. తనలాంటి అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను బయటకి వివరించగలిగింది.నిండా 17 సంవత్సరాల వయసు కూడా లేని సందర్భంలో ఓ యువతి అత్యాచారానికి గురైంది. ఆ బాధ నుంచి బయటపడిన తను.. తన దేశంలో జరుగుతున్న ఈ దారుణాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తోంది.ఇక చిన్న వయసులోనే లైంగిక వేధింపుల బారిన పడింది. ఆమెకు కాస్త మెచ్యూరిటీ వచ్చిన తర్వాత.. మనదేశంలో ఇలాంటివన్నీ సర్వసాధారణమే అని తెలిసిపోయింది. అటువంటి వాటికి వ్యతిరేకంగా ఏకంగా ఒక సంస్థను ఏర్పాటు చేసింది. ప్రజలలో చైతన్యం తీసుకొస్తోంది.ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. తెలంగాణ ప్రభుత్వం సరిగా ఏర్పాటు చేయలేకపోవచ్చు. ఇందులో కొన్ని రకాల ఇబ్బందులు ఎదురు కావచ్చు. ప్రభుత్వపరంగా కొన్ని విషయాలలో అడ్డగోలుతనం ఉండొచ్చు. కానీ అంతిమంగా సొసైటీ బాగుకోసం ఈ అతివలు ఎంచుకున్న మార్గం మాత్రం అద్భుతం. దీనికి ఎలాంటి పేరు పెట్టినా పెద్ద ఇబ్బంది లేదు. కాకపోతే అందాల పోటీలు అంటే ఒక భావన ఏర్పడిన మన సమాజం.. ఇలాంటి వాటిని ఓన్ చేసుకోవడం కొంచెం కష్టమే.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి,మే28( వెలుతురు):**




దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నప్పటికీ.. వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాల్లో ముగిశాయి. రోజంతా ఓ మోస్తరు స్థాయిలో కదలాడి చివరికి నష్టాల్లో స్థిరపడ్డాయి. ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,457.61 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,244.02 – 81,613.36 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 239 పాయింట్ల నష్టంతో 81,312.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73.75 పాయింట్ల నష్టంతో 24,752.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 85.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీ–సీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి.

# 4కోట్ల విలువైన గంజాయి పట్టివేత

**భద్రాద్రి కొత్తగూడెం,మే28( వెలుతురు):**



తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా.. వీటి రవాణా మాత్రం ఆగడంలేదు. ఈజీ మనీకి అలవాటు పడ్డ వారు గంజాయిని రవాణా చేస్తున్నారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. పక్కా సమాచారంతో బుధవారం జూలూరుపాడు మండలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి 8.30 క్వింటాళ్ల గంజాయి పట్టుకున్నారు. అనంతరం తొమ్మిది మంది సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన గంజాయి ధర మార్కెట్ లో రూ.4 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి ముఠాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పంటనష్టపోయిన రైతులకు ఊరట

- **పరిహారాన్ని ఖాతాల్లో జమచేసిన ప్రభుత్వం**

**హైదరాబాద్,మే28( వెలుతురు):**




తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి శుభవార్త చెప్పింది. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఆసరాగా నిలిచింది. రైతులకు ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పంట నష్ట పరిహారం నిధులను బుధవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవల వడగండ్ల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 29 జిల్లాల్లోని 5,528 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ అంచనా నివేదిక ప్రచారం ప్రభుత్వం రూ. 51.52 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మే నెలకు పంట నష్టపరిహారం నిధులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు.

# టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు

- **మహానాడు వేదికగా ఏకగ్రీవ ఎన్నిక**
- **ఎన్నికను ప్రకటించి..ప్రమాణం చేయించిన వర్ల రామయ్య**
- **బాబుకు మద్దుతగా పలువురు నామినేషన్లు**
- **గత 30 ఏళ్లుగా వరుసగా ఎన్నికవుతూ వస్తున్న చంద్రబాబు**
- **శక్తి ఉన్నంత వరకు ప్రజలకోసం పనిచేస్తానని బాబు హామీ**

**కడప,మే28( వెలుతురు):**



తెదేపా జాతీయ అధ్యక్షుడిగా మరోసారి చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మహానాడు వేదికగా పార్టీ ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య ప్రకటించారు. అనంతరం ఆయన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీనేతలు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. 1995లో మొదటి సారిగా చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టారు. గత 30 ఏళు ్లగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెదేపాలో ప్రతి రెండేళ్ల కోసారి అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుంది. టీ–డీపీ నాయకులంతా ఆయన్ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 1995లో చంద్రబాబు తొలిసారి తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికవుతున్నారు. మహానాడు రెండవ రోజున పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి చంద్రబాబు నామినేషన్లను పలువురు నేతలు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు పార్టీ నేతలంతా మద్దతు తెలిపారు. దీంతో చంద్రబాబు నాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చంద్రబాబును జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య మహానాడు వేదికపై ప్రకటించారు. చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టాక.. కడపతో కలుపుకుని ఇప్పటి వరకు 25 మహానాడులు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో రెండేళ్లు జూమ్ ద్వారా మహానాడు నిర్వహించారు. చంద్రబాబును 12వ సారి టీడీపీ అధినేతగా మహానాడు ఎన్నుకుంది. అనంతరం జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. దేవుడు ఇచ్చిన శక్తితో పార్టీని సమర్థంగా నడిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. మరోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్ని–కై–న అనంతరం మహానాడులో పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. నా ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. తెలుగు జాతి ఉన్నంత వరకు తెదేపా ఉంటుంది. నా బలం, బలగం తెదేపా. నాపై కార్యకర్తలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. మహానాడులో ఆరు శాసనాలపై అర్థవంతంగా చర్చలు జరిగాయి. రాబోయే 40 ఏళ్లకు ప్రణాళిక రచించుకున్నాం. నక్సలిజం రూపుమాప డానికి నిరంతరం పోరాడిన పార్టీ తెదేపా. రాయలసీమలో ఫ్యాక్షనిజం తుదముట్టించి అభివృద్ధికి బాటలు పరిచాం. రాయలసీమ రాళ్ల సీమ కాదు..రత్నాల సీమగా మారుస్తానని చెప్పాం. కోనసీమ కంటే సంపదలో అనంతపురం ముందుండడానికి తెదేపా కారణం. హైదరాబాద్‌లో మత ఘర్షణలను పూర్తిగా కట్టడి చేశాం. తెదేపా అధికారంలో ఉంటే అందరికీ రక్షణ ఉంటుంది. 2027 నాటికి పోలవరం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. హంద్రీనీవా కింద చివరి భూములకు నీళ్ల కోసం రూ.3,800 కోట్లు– ఖర్చు చేశాం. పోలవరం తర్వాత హంద్రీనీవాకు భారీగా ఖర్చు చేస్తున్నాం. వెలిగొండతో పాటు– మిగతా ప్రాజెక్టులను పూర్తి చేస్తాం అని చంద్రబాబు అన్నారు.

# విద్యుత్ సంస్కరణలతో ప్రజలకు మేలు

- **దేశంలో సంస్కరణలు ప్రవేశ పెట్టిన ఘనత బాబుదే**
- **మహానాడులో విద్యుత్ సంస్కరణలపై గొట్టిపాటి తీర్మానం**

**కడప,మే28( వెలుతురు):**



దేశంలో మొట్టమొదటి సారిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసింది సీఎం చంద్రబాబు అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులపై మహానాడులో మంత్రి గొట్టిపాటి తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1998లో విద్యుత్ రంగ సంస్కరణలను ప్రవేశ పెట్టిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ యే.. ఏపీను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన నేత కూడా చంద్రబాబేనని పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేశాడని ఆరోపించారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదు.. కానీ, వైసీపీ హాయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. అయితే, పారిశ్రామికవేత్తలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర హీనుడు జగన్ మోహన్ రెడ్డి అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించాడు. తన అనుయాయులను దోచిపెట్టి విద్యుత్ రంగంపై రూ.1.29 లక్ష కోట్లు– భారం మోపిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి.. 17 మంది సీఎంలు రూ. 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా మార్చితే.. అందులో 15 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఘనత చంద్రబాబుదే అన్నారు. ప్రధాన మంత్రి కార్యక్రమంలో పెట్టుబడిదారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి ఆకట్టుకున్న ఒకే నాయకుడు చంద్రబాబు.. 72 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా మా ప్రభుత్వం పని చేస్తుంది.. రైతులకు పగటి పూటే నాణ్యమైన ఉచిత విద్యుత్ ను మా ప్రభుత్వం అందిస్తుందని చెప్పుకొచ్చారు. విద్యుత్ వినియోగదారుడిని, ఉత్పత్తిదారునిగా మా ప్రభుత్వం మార్చుతుందని గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ఇక, రూ. 65 వేల కోట్లతో రిలయన్స్ 500 సీబీజీ ప్లాంట్లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి అన్నారు. ఈ సీబీజీ ప్లాంట్ల ద్వారా రాష్ట్రంలో 2.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాము.. రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడితో సోలర్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాయి.. పూడిమడకలో 1,200 ఎకరాల్లో కిఈ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ హైడ్రోజన్ హాబ్ ను ఏర్పాటు చేస్తుంది అన్నారు. 2030 నాటికి ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా రాష్ట్రంలోని సుమారు 57 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని మంత్రి గొట్టిపాటి అన్నారు.







https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# తదుపరి సినిమాలపై మహేశ్ టీమ్ ఫోకస్

## పలువురు దర్శకులను లైన్‌లో పెట్టినట్లు టాక్

గుంటూరు కారం సినిమా తర్వాత మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. ఇప్పటికీ ఈ సినిమా టైటిల్ ఫిక్స్ చేయలేదు. ప్రస్తుతానికి పలు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకి సమ్మర్ బ్రేక్ ఇచ్చారు. ఎప్పటిలాగే మహేష్ బాబు వెకేషన్‌కి వెళ్లిపోయాడు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ షెడ్యూల్ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది, సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే విషయం మీద ఎవరికీ క్లారిటీ- లేదు. అయినప్పటికీ ఈ సినిమా పూర్తయిన తర్వాత మహేష్ బాబు ఎవరితో సినిమా చేయాలనే విషయం మీద ఆయన టీం ప్లానింగ్ రెడీ చేస్తోంది. నిజానికి ఈ సినిమా పూర్తి అయిన వెంటనే ఆయన ముగ్గురు దర్శకులను లైన్‌లో పెట్టారు. ముందుగా సందీప్ రెడ్డి డైరెక్షన్‌లో ఒక సినిమా చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు- చెబుతున్నారు. ఒకవేళ అప్పటికే సందీప్ రెడ్డి సిద్ధంగా లేకపోతే, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సినిమా సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఎందుకంటే కల్కి సినిమా తర్వాత ఆ సినిమా బాగా నచ్చడంతో మహేష్ బాబు స్వయంగా ఆయనతో సినిమా చేయడానికి ఆసక్తి చూపాడు. వైజయంతి మూవీస్‌తో అనుబంధం కారణంగా నాగ్ అశ్విన్ కూడా మహేష్ తో సినిమా చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఆ సమయానికి ఆయన కూడా అందుబాటులో లేకపోతే.. అప్పుడు బుచ్చిబాబు డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి బుచ్చిబాబు రామ్ చరణ్ హీరోగా 'పెద్ది' అనే సినిమా చేస్తున్నాడు. అయితే మహేష్ కోసం తాను ఇప్పటికే స్క్రిప్ట్ సిద్ధం చేసుకుంటు-న్నానని గతంలో కూడా ఆయన వెల్లడించారు. కాబట్టి రాజమౌళి సినిమా తర్వాత వెంటనే ఈ ముగ్గురిలో ఎవరో ఒకరితో ఒక సినిమా ప్లాన్ చేసే అవకాశం ఉంది.




# స్పిరిట్ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడం సరైనదేనా

## సందీప్ వంగా ఎందుకింతగా రియాక్ట్ అయ్యారు




అర్జున్ రెడ్డి సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డైరెక్టర్ అనిపించుకున్న సందీప్ రెడ్డి వంగా అనూహ్యంగా వార్తల్లోకి వచ్చాడు. నిజానికి స్పిరిట్ సినిమా నుంచి దీపికా తప్పుకుందనే వార్త ముందు వెలుగులోకి వచ్చింది. దానికి దీపికా పెట్టిన కొన్ని కండిషన్స్ కారణమని కూడా అన్నారు. దీపికా పెట్టిన కండిషన్స్ నచ్చకపోవడంతో ఆమెను ప్రాజెక్టు నుంచి తప్పోమని కోరారని, దాంతో ఆమె వెళ్లిపోయిందని బయటకు తెలిసింది. అంతేకాదు, అనిమల్ సినిమాలో సెకండ్ హీరోయిన్ లాంటి పాత్రలో బోల్డ్ క్యారెక్టర్‌లో నటించిన తృప్తి డిమ్రి స్పిరిట్‌లో హీరోయిన్ అంటూ సందీప్ రెడ్డి ప్రకటించాడు. అయితే అనూహ్యంగా ఈ వార్తలు వచ్చిన తర్వాత బాలీవుడ్‌లో స్పిరిట్ ఒక ఏ రేటెడ్ సినిమా అని, ఎక్కువగా బోల్డ్ సీన్స్, లిప్ లాక్‌లు ఉండడంతోనే దీపికా నటించలేనని బయటకు వచ్చిందని బాలీవుడ్ మీడియా పోర్టల్స్‌లో ప్రచారం మొదలైంది. దీంతో ఈ విషయం మీద ఫైర్ అవుతూ సందీప్ రెడ్డి ట్వీట్ చేశాడు. సినిమా కథ చెప్పి మిమ్మల్ని సినిమాలోకి ఆహ్వానించినప్పుడే ఒక సైన్ చేయని నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్‌లోకి మీరు అడుగుపెట్టినట్లే, కానీ మీరు ఒక యంగ్ యాక్టర్‌ని నాశనం చేయాలనే ఉద్దేశంతో ఆ సినిమా కథ బయటికి చెప్తున్నారని తెలిసింది. అక్కడే మీ క్యారెక్టర్ ఏంటో బయటపడుతుంది.ఇంకా ఈ ఫేక్ ఫెమినిజం ముసుగుతో ఏం చేయాలనుకుంటు న్నారు? సరే, ఈసారి కథ మొత్తం చెప్పండి, నాకు ఏమీ ఫరక్ పడదు అంటూ ఆయన రాసుకొచ్చాడు. అయితే నిజానికి దీపికా పడుకోనే గతంలో ఎప్పుడూ వివాదాల జోలికి వెళ్లలేదు. ఆమె పలువురు హీరోలతో డేటింగ్ చేస్తుందనే వార్తలు వచ్చినా సరే, వాటిని ఖండించలేదు సరికదా, తర్వాత ఒక స్టార్ హీరోని వివాహం చేసుకొని రిలేషన్‌లోకి అడుగు పెట్టింది. ఆమెను వెనకేసుకొస్తూ ఇప్పుడు బాలీవుడ్‌లో ఆర్టికల్స్ రావడంతో దాన్ని పిఆర్ స్టంట్ అంటూ సందీప్ రెడ్డి వంగాతో సహా చాలామంది అభివర్ణిస్తున్నారు. అయితే ఇక్కడ తప్పు ఎవరిది అనే ప్రస్తావన వస్తే, ఎవరిదీ అని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చిన వారు ఎవరూ సినిమా మీద ఇలాంటి విషపు ప్రచారాలు చేయించలేదు. తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సందీప్ రెడ్డి వంగా ఇమేజ్ మరికొంత డామేజ్ అయ్యే అవకాశం ఉంటుంది.

# రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ

గుంటూరు కారం' సినిమా తర్వాత త్రివిక్రమ్ ఎవరితో సినిమా చేస్తాడు అనే విషయం మీద చాలా చర్చలు జరిగాయి. మొదట ఈ మాటల మాంత్రికుడు అల్లు అర్జున్‌కి కథ చెప్పాడు, దాదాపుగా అది ఫిక్స్ అయిపోయింది అనుకున్న తరుణంలో, అల్లు అర్జున్‌కి, కథ నచ్చకపోవడంతో ఆయన అట్లీతో సినిమా చేసేందుకు వెళ్లారు. ఇప్పుడు త్రివిక్రమ్ ఇతర హీరోలతో సినిమాలు చేసేందుకు ప్లానింగ్ చేసి, చివరికి వెంకటేష్ హీరోగా ఒక సినిమా ఫైనల్ చేశారు. ఇందులో హిరోయిన్‌గా రుక్మిని వసంత్ ని కూడా ఫిక్స్ చేశాడు. అయితే ఇప్పుడు ఈ మూవీకి సంబంధించిన మరో షాకింగ్ న్యూస్ వైరల్ అవుతుంది. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం రామ్ చరణ్‌ను సంప్రదించగా, ఆ పాత్రలో నటించేందుకు చరణ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇక త్వరలోనే ఆ సినిమా పట్టాలెక్కనున్నది. ఇక ఇప్పుడు మరో వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాని ప్రకారం రామ్ చరణ్ తర్వాత సినిమా కూడా త్రివిక్రమ్ శ్రీనివాస్‌తోనే ఉండబోతోంది. ప్రస్తుతానికి రామ్ చరణ్ 16వ సినిమాగా 'పెద్ది' రూపొందుతోంది. ఈ సినిమా పూర్తియిన వెంటనే ఆయన వెంకటేష్ సినిమాలో నటించబోతున్నాడు. ఆ సినిమా పూర్తి అయిన వెంటనే త్రివిక్రమ్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో ఒక మంచి పాన్ ఇండియా సబ్జెక్ట్ రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ఆ రకంగా రామ్ చరణ్ బ్యాక్ టు- బ్యాక్ ప్రాజెక్ట్స్ గురూజీ తోనే చేయబోతున్నాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇప్పటివరకు త్రివిక్రమ్ ఏ సినిమా చేసినా సితార ఎంటర్-టైన్‌మెంట్స్ లేదా హారిక హాసినితోనే చేసేవాడు. కానీ ఇప్పుడు రామ్ చరణ్‌తో చేయబోయే సినిమాకి కొత్త బ్యానర్ ఒకటి రంగంలోకి దిగబోతున్నట్లుగా తెలుస్తోంది.



# కమల్‌తో అనుబంధం మరువలేనిది

## థగ్‌లైఫ్ ప్రమోషన్‌లో శివరాజ్ కుమార్



తమిళ సూపర్ స్టార్ కమల్ హాసన్ కు ఎలాంటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో మనకు తెలిసిందే హీరోలో సైతం ఆయనకు పిచ్చ ఫ్యాన్స్ ఉన్నారు. ఇక ప్రజంట్ మణిరత్నం దర్శకత్వంలో 'థగ్ లైఫ్' మూవీ నటించాడు. త్రిష, శింబు వంటి స్టార్స్ అందరూ భాగం కాబోతున్న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల చెన్నైలో ఈ సినిమా ఆడియో ఈవెంట్‌లో ఎంతో అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివరాజ్ కుమార్, తన అభిమాన నటుడి గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఒకసారి కమల్ సర్ మా ఇంటికి వచ్చారు. నాన్నగారితో మాట్లాడుతుంటే నేను పక్కన నిలబడి ఆయన్నే చూస్తూ ఉన్నాను. అప్పుడు ఆయన నన్ను చూసి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. ఆ తర్వాత నేను ఆయన్ని కౌగిలించుకోవచ్చా అని అడిగాను, ఆయన నవ్వుతూ సరే అన్నారు. ఆ తర్వాత నేను మూడు రోజుల వరకు స్నానం చేయలేదు. ఆయన వాసన నాపై అలాగే ఉండాలని. ఆయనంటే నాకు అంత అభిమానం. అలాగే నేను క్యాన్సర్‌తో పోరాడుతున్న సమయంలో కమల్ హాసన్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ ఎప్పటికి మర్చిపోలేను. నాకు నా తండ్రి డాక్టర్ రాజ్‌కుమార్‌తో మాట్లాడినట్లు- అనిపించింది' అని శివరాజ్ కుమార్ వెల్లడించారు.

# హరిహర వీరమల్లులో అదిరిపోతున్న సాంగ్స్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, దర్శకులు క్రిష్ జాగర్లమూడి అలాగే జ్యోతి కృష్ణలు తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ ఎప్పుడో రావాల్సింది.. కానీ ఎన్నో ఇబ్బందులు ఎదురుకొని ఫైనల్‌గా ఈ జూన్ 12న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కాబోతుంది. ఇక విడుదల సమయం దగ్గర పడుతుండడంతో, ఒక్కో అప్ డేట్ వదులుతున్నారు మూవీ మేకర్స్. కాగా ఇప్పటికే మూడు పాటలు రిలీజ్ కాగా, తాజాగా సినిమా నుంచి నాలుగో సాంగ్ కూడా విడుదలైంది. ఇక ఈ సాంగ్ లో నిధి లుక్ అదిరిపోయింది. లిరిక్స్ బ్యాగ్రౌండ్ స్మూత్‌గా కిక్కిచ్చేలా ఉందని చెప్పాలి. కీరవాణి మంచి ట్యూన్‌ని అందించగా శ్రీహర్ష ఈమని ఇచ్చిన సాహిత్యం కూడా బాగుంది. ఇక ఈ సాంగ్ లో లిప్సిక భాష్యం గొంతు, బాగా ప్లస్ అయ్యిందని చెప్పాలి. అలాగే సాంగ్ లో విజువల్స్ కూడా ఒకింత ఆశ్చర్యకరంగా ఉన్నాయి. సాంగ్ మూడ్ కి తగ్గట్టుగా సెట్ చేసిన సెట్టింగ్స్ విశేషంగా ఆకట్టు-కుంటు-న్నాయి. ఇక నిధి అగర్వాల్ అయితే మెయిన్ ఎసెట్ అని చెప్పవచ్చు. తన గ్లామర్ ఇంకా తన డాన్స్ మూమెంట్స్ సాంగ్ లో చాలా బాగున్నాయి. మొత్తానికి నాలుగో పాట కూడా అదిరిపోయింది.

# మిరాయ్ టీజర్ అదుర్స్

హనుమాన్' లాంటి భారీ హిట్ అందుకున్నా తేజ సజ్జ మళ్ళీ అదే తరహాలో 'మిరాయ్' వంటి భారీ పాన్ వరల్డ్ చిత్రంతో వస్తున్నాడు. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్న ఈ షూటింగ్‌కి, కొంచెం ఎక్కువ సమయం తీసుకుంటున్నప్పటికీ ఆ మధ్య వచ్చిన గ్లింప్స్ అందరికీ షాకిచ్చింది. ఒక్కో పోస్టర్ మాత్రం మూవీ అంచనాలు బాగా పెంచేసింది. ఇక ఈ రోజె అవై-టె-డ్ టీ-జర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ ఊహించని రీతిలో ఉందని చెప్పాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉంది. ఇండియన్ సినిమా దగ్గర ఎన్నో భారీ సినిమాలు వస్తున్నాయి కానీ కంటెంట్ ఉంటే దానికి తగ్గట్టుగా కావాల్సిన ప్రామిసింగ్ విజువల్స్ కూడా చాలా మెయిన్. ఇక 'మిరాయ్' దానికి అతీతంగా ఉందని చెప్పడంలో సందేహం లేదు. స్టన్నింగ్ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఒక హాలీవుడ్ సినిమా చూస్తున్న ఫీల్ వచ్చింది. ముఖ్యంగా మంచు మనోజ్.. అదరకొట్టాడు. సాహస సన్నివేశాల్లో తేజ ఎక్కడా కూడా అసలు కాంప్రమైజ్ అయినట్టే కనిపించడం లేదు. అలాగే ఇండియన్ సినిమాకు ఒక సరికొత్త అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమాగా ఇవ్వబోతున్నట్లు- తెలుస్తుంది. ఇక లాస్ట్ షాట్‌లో రాముని రాకపై చూపించిన విజువల్ వర్ణనాతీతం.. మొత్తానికి 'మిరాయ్' తెలుగు ఇండస్ట్రీని మరో మెట్టు- ఎక్కించేలా కనిపిస్తుంది.



## ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ నివాళి

- ఘాట్ వద్ద పలువురు శ్రద్ధాంజలి



**హైదరాబాద్,మే28( వెలుతురు):**

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌లు నివాళి అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు- చేశారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద నందమూరి రామకృష్ణ, సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి నివాళి అర్పించారు. నందమూరి అభిమానులు, తెదేపా నేతలు అక్కడికి తరలివచ్చారు. తండ్రికి నివాళి సందర్భంగా తనయుడు రామకృష్ణ ఉద్వేగానికి లోనయ్యారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు శత జయంతి పురస్కరించుకుని పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద మాజీ టిడిపి నేతలు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రపంచ ఖ్యాతి గడించిన ఏకైక తెలుగు బిడ్డ ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేస్తామన్నారు. రాజకీయాల్లో, సినిమాల్లో ఆయనకు తారాస్థాయిలో అభిమానులున్నారు. మరోవైపు ఎన్టీఆర్ జయంతి వేళ ఆయన అభిమానులు, తెదేపా కార్యకర్తలు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆయన సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్టీఆర్ అంటే ఓ ప్రభంజనం అని.. ఆయనో సంచలనం అని అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలుగు దేశం పార్టీ స్థాపించి దేశ రాజకీయాల్లో తెలుగు వారి సత్తా చాటిన రాజకీయ యోధుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు జాతి చరిత్ర ఉన్నంత కాలం ఎన్టీఆర్ చరిత్ర నిలిచిపోతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## ఎపిలో పెరుగుతున్న కరోనా కేసులు

- మరో ఇద్దరికి పాజిటివ్‌గా గుర్తింపు




**విజయవాడ,మే28( వెలుతురు):**

కరోనా వైరస్ మరోసారి కలవరపెడుతోంది.. ప్రపంచవ్యాప్తంగా విజృంభించి.. ఎన్నో లక్షలమంది ప్రాణాలు తీసిన ఈ వైరస్.. మరోసారి విరుచుకుపడుతోంది.. అయితే ఈ కొత్త వేరియంట్ డేంజర్కాదని వైద్యులు అంటున్నా, జాగ్రత్తగా ఉండాల్సిందేనని సూచిస్తున్నారు. దేశవ్యాప్తంగా క్రమంగా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది.. ఇప్పటికే పాజిటివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటిపోయినట్టు- అధికారిక లెక్కలే చెబుతున్నాయి.. అయతే, ఏపీలోనూ కోవిడ్ 19 కేసులు వెలుగు చూస్తున్నాయి.. రాష్ట్రంలో తాజాగా, మరో మూడు కరోనా పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో పరీక్షల అనంతరం ఏలూరుకు చెందిన భార్యాభర్తలకు కరోనా సోకినట్లుగా తేల్చారు వైద్యులు.. మరోవైపు, తెనాలికి చెందిన 83 ఏళ్ల వృద్ధుడు కరోనా బారినపడ్డారు. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఇద్దరికి కరోనా నిర్ధారణ కాగా, దేశవ్యాప్తంగా కేసులు వెయ్యి దాటినట్టు- అధికారులు వెల్లడించారు. అయితే, కరోనా బారినపడకుండా.. ప్రజలు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు వైద్యులు..

## ఒత్తడి అధిగమించాలంటే యోగా తప్పనిసరి

- ఎందరో వచ్చి నేర్చుకుని వెలుతున్నారు
- విశాఖలో అంతర్జాతీయ యోగా నిర్వహణ
- యోగాపై మంచి పాటరాస్తే బహుమతి ఇస్తానన్న బాబు

**కడప,మే28( వెలుతురు):**



అభివృద్ధి చెందిన దేశాల్లోనూ యోగా వారి జీవితాల్లో భాగమైందని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎంతోమంది మన దేశానికి వచ్చి యోగా నేర్చుకుని తమ దేశాల్లో అమలు చేస్తున్నారని చెప్పారు. కడపలో రెండో రోజు మహానాడులో సీఎం మాట్లాడారు. ఒత్తిడిని అధిగమించాలంటే యోగా తప్పనిసరి. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా నెలగా నిర్వహిస్తున్నాం. విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భీమునిపట్నం వరకు 25కి.మీ పరిధిలో 5 లక్షల మందితో యోగా చేయబోతున్నాం. ఒకే ప్రాంతంలో 5లక్షల మందితో ఇలా చేయడం గిన్నిస్ రికార్డు కాబోతోంది. ఆరోజు రాష్ట్రం మొత్తం 2 కోట్ల మంది యెగా చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. కనీసం 20 లక్షల మంది యోగా సర్టిఫికేషన్లు తీసుకోవాలి. ఏకాగ్రత పెంచుకునేందుకు అందరూ చేయాలి. యోగాపై మంచి పాట రాస్తే బహుమతి ఇస్తాం అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇకపోతే విశాఖ యోగాకు ప్రధాని మోడీ రాబోతున్నారని అన్నారు. దీనిని ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్నామని అన్నారు.

## రాజకీయ,సినీ రంగాల్లో రాణించిన ఏకైక నేత

- ఎన్టీఆర్‌కు నివాళితో రెండోరోజు మహానాడు ప్రారంభం
- వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పుష్పాంజలి

**కడప,మే28( వెలుతురు):**

దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళితో టీడీపీ మహానాడు రెండవ రోజు ప్రారంభమైంది. స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడు వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యనేతలు నివాళులర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. మహానాడు తొలిరోజు కీలక అంశాలపై చర్చించుకున్నా మన్నారు. పార్టీ బలోపేతం, ప్రజలకు మేలు చేసేలా చర్చలు జరిగాయన్నారు. తెలుగుజాతి ఆరాధించే మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి అంటే తెలుగుజాతికి పండగ రోజు అని అన్నారు. ఒకే వ్యక్తి రెండు రంగాల్లో రారాజుగా రాణించడం చరిత్రలో చూడలేదన్నారు. ఎన్టీఆర్ అంటే పేదవాడికి భరోసా.. రైతులకు నేస్తం అని వెల్లడించారు. ఎన్టీఆర్ రూపొందించిన పసుపు జెండా శాశ్వతంగా ఉంటుందని స్పష్టం చేశారు. 2024 ప్రజల తీర్పుతో విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు వెళ్తున్నామని అన్నారు. పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇదిలావుంటే నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఏపీ



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. 'యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు వారి ఆరాధ్య దైవం, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, సంక్షేమానికి కొత్త బాట చూపిన సంఘ సంస్కర్త, 'అన్న' నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అనే మూడు అవసరాలను తీర్చడమే తన జీవితాశయంగా భావించిన ధీరోదాత్తుడు అన్న ఎన్టీఆర్. 'సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దార్శనికుడు ఆయన. అన్నగా ఆడబిడ్డలకు ఆస్తి హక్కు ఇచ్చినా, మండల వ్యవస్థతో పాలనారంగాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లినా, పక్కా ఇళ్ల నిర్మాణంతో పేదలకు అండగా నిలిచినా, కిలో రెండు రూపాయలకే బియ్యాన్ని అందించి పేదల ఆకలి తీర్చినా ... ఏది చేసినా ఆయన మనసులో ఉన్నది ఒక్కటే... 'నా తెలుగు జాతి సగౌరవంగా తలెత్తుకు నిలబడాలి' అనే సంకల్పమే. చరిత్రలో స్థానం సంపాదించుకోవడం కాదు... చరిత్రనే సృష్టించిన చిరస్మరణీయుడు అన్న ఎన్టీఆర్. ఈనాటికీ తెలుగుదేశం ఉజ్వలంగా ప్రకాశిస్తున్నదంటే అది ఆయన ఆశీర్వాదబలమే. ఆ మహనీయుడి సంకల్పాన్ని నెరవేర్చేందుకు అహర్నిశలూ కష్టపడుతూనే ఉన్నాం.... సమసమాజాన్ని సాధించే దిశగా సాగుతున్నాం. అనితరసాధ్యమైన ఎన్నో పనులు చేసిన అన్న నందమూరి తారకరామారావుకు మరొక్కమారు ఘన నివాళి అర్పిస్తున్నాను.' అని చంద్రబాబు పోస్టులో పేర్కొన్నారు.

## ఎన్‌టీఆర్‌కు టిడిపి నేతల ఘననివాళి

- రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక ముద్ర
- తీర్మానాన్ని ప్రవేశ పెట్టిన అశోక గజపతి

**కడప,మే28( వెలుతురు):**



సాటిలేని చరిత్ర ఎన్టీఆర్‌దని.. ఆయన నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని తెదేపా సీనియర్ నేత అశోక్‌గజపతి రాజు అన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మహానాడులో నేతలు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. యుగపురుషుడికి నివాళి తీర్మానాన్ని అశోక్‌గజపతిరాజు ప్రవేశపెట్టగా.. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చినరాజప్ప బలపరిచారు. ఎన్టీఆర్‌తో కలిసి రాజకీయ ప్రయాణం నా అదృష్టం. తెలుగు జాతి ఉన్నంత వరకు తెదేపా కొనసాగుతూనే ఉంటుంది. ఎన్నో ఒడుదొడుకులు ఎదురైనా చంద్రబాబు భయపడలేదు. తెదేపా కుటుంబ పెద్దగా చంద్రబాబు నాయకత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాలని అశోక్‌గజపతి రాజు అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని మహోన్నత శిఖరంపై నిలబెట్టిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగు జాతి చరిత్రను తిరగరాసి వెలుగులు నింపిన మహనీయుడు ఆయన అని మంత్రి పయ్యావుల కేశవ్ నివాళి అర్పించారు. సినీ రంగంలో రారాజుగా విరజిల్లుతూ రాజకీయాల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు అన్నారు. పేదవాడి ఆకలి తీర్చడానికి కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ మేరకు దివంగత నేతకు ఆయన నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఆదర్శ నేత అని ఆయన ఎప్పుడూ పేదల సంక్షేమం కోసం తపించారని అన్నారు. అలాంటి ఆశయాలను నాయకులు కొనసాగించాలన్నారు. తెలుగుజాతికి ఇవాళ పర్వదినమని అన్నారు. రైతు కుటుంబంలో పుట్టి ఎన్టీఆర్ అసాధారణ ప్రతిభ చూపారని కొనియడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. బడుగు, బలహీనవర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ కృషి చేశారన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్నారు. కొందరికే పరిమితమైన అధికారాన్ని సామాన్యుల వద్దకు తీసుకువచ్చారన్నారు. తెలుగు జాతికి సేవ చేయాలని సినీ రంగాన్ని విడిచి పెట్టి ఎన్టీఆర్ రాజకీయంలోకి వచ్చారనిమంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సినీ రంగంలో తెలుగు జాతికి ఎన్టీఆర్ మంచి పేరు తెచ్చారని అచ్చెన్నాయుడు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అచ్చెన్నాయుడు, పలువురు టీడీపీ నేతలు నివాళర్పించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాజకీయలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. ఆనాడు జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలను ఏకం చేసి పోరాటం చేసిన ఘనత ఎన్టీఆర్‌దని గుర్తుచేశారు.బడుగు బలహీన వర్గాలకు అవకాశం ఇచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని వెల్లడించారు. వెనుకబడిన, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ కృషి చేశారని కొనియాడారు. వికేంద్రీకరణ, ఫెడరల్ వ్యవస్థ బలోపేతం కోసం పనిచేశారన్నారు. నేషనల్ ఫ్రంట్‌తో కేంద్రంలో ప్రత్యామ్నాయం తీసుకువచ్చారన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆర్ పెద్దపీట వేశారని, కిలో బియ్యం రూ.2కే ఇచ్చారని కొనియాడారు. రైతు రుణాలు రద్దు, రూ.50కే హార్స్ పవర్ కరెంట్ అందజేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు.

## లోకేశ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలి

- మహానాడులో ధూళిపాళ్ల, పయ్యావుల డిమాండ్

**కడప,మే28( వెలుతురు):**

మంత్రి నారా లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించాలంటూ డిమాండ్ ముందుకు వచ్చింది. కడపలో జరుగుతోన్న మహానాడు వేదికగా నారా లోకేష్‌కు కీలక పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర ప్రతిపాదించారు. నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని తాము మినీ మహానాడులో తీర్మానించామని సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ధూళిపాళ నరేంద్ర చెప్పారు. పార్టీలోని వారంతా కోరుకుంటున్న విధంగా నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు ధూళిపాళ నరేంద్ర విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టబెట్టాలని తెలుగుదేశం పార్టీలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతుంది. అందులోభాగంగా పార్టీలోని సీనియర్ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితోపాటు- పలువురు నేతలు ఇదే విషయాన్ని బుధవారం మహానాడు వేదికగా స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలని




పార్టీ కార్యకర్తల నుంచి డిమాండ్ వస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కార్యకర్తలతో పాటు- నేతలంతా ఇదే కోరుకుంటున్నారని చెప్పారు. లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలన్నది ఇప్పుడు అత్యవసరం అన్నారు. పార్టీ మరింత బలోపేతం కావాలంటే ఇది సహేతుకమైన నిర్ణయమని పేర్కొన్నారు. కడపలోని 'మహానాడు' ప్రాంగణంలో ఆయన ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్ష్యుడిగా మరోసారి సీఎం చంద్రబాబు నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. ఆ క్రమంలో నారా లోకేశ్‌ను సైతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికే నారా లోకేశ్.. ప్రజా క్షేత్రంలోనే కాదు.. మంత్రిగా కూడా సక్సెస్ అయ్యారని పార్టీ కేడర్ సైతం స్పష్టం చేస్తుంది. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ స్థానం నుంచి నారా లోకేశ్ విజయం సాధించారు. అనంతరం చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో అత్యంత కీలమైన విద్య, ఐటీ- శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అదీకాక.. 2023 జనవరి 27వ తేదీన నారా లోకేశ్.. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రజా క్షేత్రంలో లోకేశ్ పరిణితి చెందిన నాయకుడిగా ప్రజల నుంచి మన్ననలు అందుకున్న విషయం విదితమే.

## రైతులకు కేంద్రం శుభవార్త

- వరి తదితర పంటలకు మద్దతు ధరల పెంపు
- వరిపై 69 రూపాయలు పెంచుతూ నిర్ణయం

**న్యూఢిల్లీ,మే28( వెలుతురు):**

కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతులకు శుభవార్త చెప్పింది. వరి మద్దతు ధర పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌కు వరి మద్దతు ధరను 69 రూపాయలకు పెంచింది. తాజా పెంపుతో క్వింటా వరి మద్దతు ధర 2,369 రూపాయలకు చేరింది. కేంద్రం మద్దతు ధర కోసం 2.70 లక్షల కోట్ల రూపాయలు కేటాయించింది. అంతేకాదు.. రైతులకు వడ్డీ రాయితీ కింద 15,642 కోట్ల రూపాయలు కేటాయించింది. పెట్టుబడిపై రైతులకు 50 శాతం లాభం ఉండేలా నిర్ణయం తీసుకుంది.ఖరీఫ్ సీజన్‌లో వరి సహా 14 పంటలకు మద్దతు ధర పెంపునకు ఆమోదం తెలిపింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్వింటాల్ వరిపై రూ.69 పెంచడంతో కనీస మద్దతు ధర రూ.2369కి చేరింది.




కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. గత 10-11 ఏళ్లలో ఖరీఫ్ పంటలకు ఎంఎస్‌పీ భారీగా పెంచినట్లు- ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కోసం ఎంఎస్‌పీ పెంపును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. ఆయా పంటలకు ఎంఎస్‌పీ కోసం రూ.2.7లక్షల కోట్లు- కేటాయిస్తున్నట్లు- తెలిపారు. రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కోట్లతో పాటు- అన్నదాతల పెట్టుబడిపై 50శాతం మార్జిన్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- మంత్రి పేర్కొన్నారు. మరోవైపు, ఏపీలోని బద్వేల్- నెల్లూరు నాలుగు వరుసల రహదారి అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,653 కోట్లతో 108.134 కి.మీల పొడవున ఈ రహదారిని అభివృద్ధి చేయనుంది. బద్వేల్‌లోని గోపవరం నుంచి నెల్లూరు జిల్లాలోని గురివిందపూడి వరకు నిర్మాణం చేపట్టే ఈ కారిడార్‌తో కృష్ణపట్నం పోర్టుకు ప్రయాణ దూరం దాదాపు 33.9 కిలోమీటర్లు తగ్గనుంది. అలాగే, ఈ కారిడార్ నిర్మాణంతో భారీగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్రం తెలిపింది. వరి సహా మొత్తం 14 ఖరీఫ్ పంటలకు క్వింటాల్‌పై కనీస మద్దతు ధ(ఃꠏూ) కేంద్రం పెంచింది. వీటిలో వరి సాధారణ, గ్రేడ్- ఏలకు రూ.69 పెంచగా.. జొన్నలు రూ.328; సజ్జలు రూ.150; రాగులు రూ.596; మొక్కజొన్న రూ.175; కందిపప్పు రూ.450; పెసర రూ.86; మినుములు రూ.400; వేరుశెనగ రూ.480; పొద్దుతిరుగుడు రూ.441; సోయాబీన్ రూ.436; కుసుమలు రూ.579; వలిశలు (గడ్డినువ్వులు) రూ.820; పత్తి రూ.589 చొప్పున కనీస మద్దతు ధరను పెంచారు.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com